ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు

బోర్లలో నీరు రాకపోవడంతో సాగుకు నోచుకోని టమోటా పొలం



టమోటా రైతుకు
క'న్నీటి' కష్టాలు..!

- ఎండుతున్న టమోటా పంటలు
- ధరలున్నా చేతికందని పంట
- రూ.లక్షలు నష్టపోతున్న రైతన్న
- అడుగంటుతున్న భూగర్భ జలాలు

గుర్రంకొండ, ఏప్రిల్ 7: పడమటి మండలాల టమోటా రైతన్నలను ప్రకృతి ఏదో ఒక విధంగా దెబ్బతిస్తూనే ఉంది. టమోటా ధరలున్న సమయంలో అధిక వర్షాలు కురవడంతో పంట దెబ్బతినడం లేదా పంటకు తెగుళ్ల సోకడం, లేదా అంతా బాగున్నా మంచి ధర లేకపోవడం ఇలా ఏదో విధంగా టమోటా రైతు దెబ్బతింటూనే ఉన్నాడు. ఇన్ని సమస్యల నడుమ టమోటా పంటను సాగు చేసిన రైతులకు కొత్తగా నీటి సమస్య వచ్చి పడింది. భూగర్భజలాలు రోజురోజుకు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వేసిన వెయ్యి అడుగుల లోతున్న బోర్లు కూడా నీటి చుక్క లేక ఇంకిపోతున్నాయి. దీంతో సాగు చేసిన పంట కళ్ల ముందే ఎండుతుంటే చూడలేకపోతున్నారు. అలాగనీ దిగుబడి వచ్చే పంటను వదులుకోలేక పడరానిపాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో టమోటా రైతులు పంటను కాపాడుకోవడానికి ట్యాంకర్లతో నీటిని పడుతున్నారు. టమోటాకు ప్రస్తుతం మంచి ధరలుండడంతో ఎలాగైనా పంటకు నీరు పారించి పంట ఖర్చుకు చేసిన పెట్టుబడులైనా దక్కించుకోవాలని రైతులు నానా తంటాలు పడుతున్నారు.

పడమటి మండలాలైన గుర్రంకొండ, మదనపల్లె, వాల్మీకిపురం, కలకడ, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండెం, కురబలకోట, పీటీఎం, కొత్తకోట, రామసముద్రం, నిమ్మనపల్లె, కలికిరి మండలాల్లో రైతన్నలు వేలాది ఎకరాల్లో టమోటా పంటను సాగు చేస్తారు. ప్రతిఏటా జనవరి మాసం నుంచి ఏప్రిల్ చివరి వరకు టమోటా పంటను విస్తారంగా రైతులు సాగు చేస్తారు. ఈ క్రమంలో ఇప్పటికే రైతులు వేలాది ఎకరాల్లో టమోటా పంటను సాగు చేయగా కొంతమంది రైతులకు దిగుబడి వస్తోంది. అయితే గత ఏడాది వర్షాలు అరకొరగా కురవడంతో చాలా మండలాల్లో చెరువులోకి చుక్క నీరు కూడా చేరలేదు. ఈ క్రమంలో రైతులు వేసిన బోర్లలో రోజు రోజు కు నీటిమట్టం తగ్గి అరకొరగా నీరు వస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో వారం రోజుల నుంచి వందలాది బోర్లు ఇంకిపోతున్నాయి. దీంతో బోర్లను నమ్ముకుని టమోటా పంటను సాగు చేసిన రైతులు విలవిల్లాడుతున్నారు.

ధరలున్నా చేతికందని పంట

ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ క్రమంలో కిలో టమోటా ధర రూ.30 పైగా పలుకుతోంది. టమోటా పంటకు ధరలుండడంతో రైతులు సాగుకు లక్షలాది రూపాయలను ఖర్చు చేశారు. అయితే కొంతమంది రైతులకు బోర్లలో నీరు రావడం లేదు. దీంతో టమోటా పంటకు నీరు లేక కళ్ల ముందే ఎండిపోవడం చూడలేక పడరానిపాట్లు పడుతున్నారు. పంటను కాపాడుకోవడం కోసం నీటి ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ తడులతోనైనా ఉన్న కాయలను కోసుకోవాలని శ్రమ పడుతున్నారు. సాగుకు చేసిన ఖర్చులైనా వస్తాయని తీవ్రంగా కష్టపడుతున్నారు.

లక్షల్లో నష్టపోతున్న రైతన్న

టమోటా పంట సాగుకు రైతన్నలు లక్షలు ఖర్చు చేశారు. అయితే నీటి సమస్య తలెత్తడంతో రైతులు లక్షలాది రూపాయలను నష్టపోతున్నారు. కొందరు రైతులు పంట సాగుకు దుక్కి దున్ని సాగుకు సిద్ధం చేశారు. ఇందుకు లక్షలాది రూపాయలను ఖర్చు చేశారు. ఈ క్రమంలో బోర్లలో నీరు నిలిచిపోవడంతో సాగు చేయకనే నష్టాలను చవిచూస్తున్నారు. అలాగనీ వదిలేయకుండా కొందరు రైతులు ఇంకిపోయిన బోర్ల స్థానంలో కొత్త బోర్లను వేస్తున్నారు. ఈ కొత్త బోర్లలో కూడా అరకొరగా నీరు పడడంతో పంటను కాపాడుకోలేకపోతున్నారు.

వెయ్యి అడుగులకు పడిపోయిన భూగర్భ జలాలు

గుర్రంకొండ మండలంలో భూగర్భ జలాలు వెయ్యి అడుగుల లోతుకు పడిపోయాయి. గత రెండేళ్లుగా వర్షాలు సమృద్ధిగా పడలేదు. దీంతో చెరువుల్లో నీరు లేక భూగర్భ జలాలు అడుగంటాయి. ఈ క్రమంలో 500 అడుగుల లోతున్న బోర్లు వారం రోజులుగా ఇంకిపోతున్నాయి. ఆపై లోతున్న బోర్లలో మాత్రం ప్రస్తుతానికి నీరు వస్తున్నాయి. ఏప్రిల్, మే నెలలో మరెన్ని బోర్లు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది.



చుక్కనీరులేక ఎండిపోయిన కానుగమాకులకుంట



జాడే లేని.. నీటి చుక్క



అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అంటే ఇదేనేమో. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో వెలిగల్లు ప్రాజెక్టు ఉన్నా.. నీటి కష్టాలు తీరడం లేదు. వేసవి వచ్చిందంటే జనం గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అభివృద్ధిని పెడచెవిన పెట్టిన ప్రభుత్వం కనీసం మండల వాసులకు మంచినీటి సమస్యను కూడా పరిష్కరించకపోవడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు. సాగు, తాగునీరు అందిస్తామని ఓట్లు వేయించుకున్న ప్రభుత్వం ప్రజలను, రైతులను గాలికి వది లేసి తన సొంత అభివృద్ధికి బాటలు వేసుకొన్నారని పలువురు విమర్శిస్తున్నారు.



గొట్టివీడులో నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్

- గొంతెండుతున్న పల్లెలు
- వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం.. గాలివీడు వాసులకు శాపం
- వెలిగల్లులో నీళ్లున్నా.. ఫలితం శూన్యం
- మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు

గాలివీడు, ఏప్రిల్ 7: మండలంలో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొన్నది. మండల వ్యాప్తంగా పల్లెలన్నీ గొంతెండుతున్నాయి. మండలంలో 17 గ్రామ పంచాయతీలు, 205 పల్లెలు ఉన్నాయి. ఇందులో 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. ముఖ్యంగా అరవీడు, గోరాన్‌చెరువు, ఎగువగొట్టివీడు, గోపనపల్లె, పేరంపల్లె, గుండ్లచెరువు, నూలివీడు, సీసీపల్లె, పందికుంట తదితర పంచాయతీల్లోని పల్లెల్లో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొన్నది. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రెండు, మూడు గ్రామాలకు మంచినీరు అందిస్తున్నప్పటికీ అవి పల్లె ప్రజలకు పూర్తిగా అందడం లేదు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

గత నాలుగేళ్లుగా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని గ్రామాలకు సాగు, తాగునీరు అందిస్తామని గత 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే మండల ప్రజలకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత సాగు తాగునీటిని గాలికి వదిలేశారు. వెలిగల్లు ప్రాజెక్టులో నీళ్లు ఉన్నా ప్రజలకు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉన్నది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గోరాన్‌చెరువు, ఎగువగొట్టివీడు, మాధవరం గ్రామాల్లో మంచినీటిని అందించడానికి ఓవర్‌హెడ్ ట్యాంకులను పైపులైన్లను పూర్తి చేసింది. కానీ అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పైపులైన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకులకు నీళ్లను ఎక్కించకుండా చేసి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందని ప్రజలు ఆరోపించారు. నాలుగు సంవత్సరాలకు పైగా అధికారంలో ఉండి కనీసం మంచినీటి సమస్యను ప్రభుత్వం తీర్చలేదని వాపోయారు. మండలం లోని ప్రతి పల్లెలో మంచినీటితో ప్రజలు సతమతమవుతున్నారు. గుక్కెడు నీటి కోసం రైతుల వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. పల్లెల్లో నివసిస్తున్న ప్రజలు కూలి పనులకు పోతే తప్ప జీవనం సాగదు. కానీ నేడు చాలా మంది ప్రజలు కూలి పనులను వదులుకొని నీళ్ల కోసం రోజంతా సమయాన్ని కేటాయిస్తున్నారు. మరికొంత మంది అప్పులు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇంకొందరు బిందె రూ.4కు మంచినీటిని కొనుగోలు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం వల్ల ఇలాంటి దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నామని పలువురు ఆరోపించారు.



గుండ్లచెరువులో అడుగంటిపోయిన బోరుబావి

ట్యాంకర్లతో నీటి సమస్యను పరిష్కరిస్తున్నాం..

గ్రామాల్లో నెలకొన్న మంచినీటి సమస్యను ట్యాకర్ల ద్వారా, రైతుల వ్యవసాయ బోర్ల ద్వారా పరిష్కరిస్తున్నాము. ప్రస్తుతానికి చాలా గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాము. అవసరమైతే ఇంకా ఎక్కువ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాము.

- ప్రతాప్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ



బిందె రూ.4తో కొంటున్నాము..

మేము దళితులము. రోజంతా కూలి పని చేస్తేనే పూట గడుస్తుంది. ఆ కూలి డబ్బులతోనే జీవనం సాగిస్తున్నాము. మా గ్రామానికి గత 6 నెలలుగా మంచినీళ్లు లేవు. మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాము. ట్యాంకర్ల ద్వారా బిందె రూ.4 పెట్టి మంచినీటిని కొంటున్నాము. ఇంట్లో ఇద్దరం కూలికి పోతే ఒకరికూలి మంచినీళ్ల కొనుగోలు చేయడానికి సరిపోతుంది. ఇలా అయితే మేము ఎలా బతకాలి. మంచినీటి సమస్యను పరిష్కరించాలని అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించాలి.

- అంజనమ్మ, ఎస్సీ కాలనీ, ఎగువగొట్టివీడు

కూలి పనులు వదులుకొని మంచినీటి కోసం ప్రయత్నం..



మా పల్లెలో 40 ఇళ్లు ఉన్నాయి. ప్రతి ఇంట్లో మూగజీవాలు ఉన్నాయి. గత ఏడాదిగా మేము మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నాము. మా పల్లెలో ఉండే వాళ్లు అందరము కూలి పనులు చేసుకొని బతకాల్సిందే. ఇంట్లో ఎంత మంది ఉంటే అందరం గతంలో కూలి పనులకు వెళ్లేవారము. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ప్రతి కుటుంబంలో ఒకరు మంచి నీటి కోసం ఉండాల్సి వస్తోంది. మా గ్రామానికి ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించాలి.

- శ్యామలమ్మ, నగిరి గుట్టపల్లె



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

ఎన్నికలకు సన్నద్ధం కావాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 7: జిల్లాలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సర్వం సన్నద్ధం కావాలి, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి. పక్కా ప్రణాళిక, టీం వర్క్‌తో ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ రిటర్నింగ్ అధికారులు, జిల్లా, మండల స్థాయి నోడల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా, మండల స్థాయి నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ అంశంలో తీసుకున్న చర్యలపై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గాల్లో నోడల్ అధికారుల నియామకం, మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, పీవో, ఏపీవో, ఓపీవోల నియామకం, ఎఫ్‌ఎస్టీ, ఎస్‌ఎస్టీ, సీ-విజిల్ పరిష్కారం, మెటీరియల్, ఈవీఎంల మేనేజ్‌మెంట్, రిసెప్షన్ డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ ఏర్పాట్లు, ఐటీ అప్లికేషన్స్ నిర్వహణ, ఈవీఎంల ఫస్ట్ ర్యాండమైజేషన్, ఈవీఎం స్ట్రాంగ్ రూముల ఏర్పాట్లు, బ్యాలెట్ పేపర్ రిక్రూట్మెంట్, ప్రింటింగ్, హోమ్ ఓటింగ్, పీడబ్ల్యుడీ, అత్యవసర సేవల ఓటర్ల పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్‌లపై తీసుకున్న చర్యలు, పోలింగ్ డే మేనేజ్మెంట్, లా అండ్ ఆర్డర్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు, నామినేషన్స్, వెబ్‌కాస్టింగ్ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని లోపాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మ్యాన్ పవర్‌లో భాగంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు వీవీటీ ఎస్‌ఎస్‌టీ అదర్ సెక్రటేరియల్ అధికారులకు ఐడీ కార్డులు జారీ చేయాలన్నారు. ఎన్నికల్లో పోలీసు శాఖతో సమన్వయం చే సుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నగదు, బంగారం, వెండి, మద్యం, గంజాయి, వస్తువుల రవాణా, లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణరావు, ఆర్డీవోలు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా, మండలస్థాయి నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వారు

పేదలకేది పప్పన్నం

- రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా చేయని ప్రభుత్వం
- ఈ ఉగాదికీ నిరాశే






సుండుపల్లె, ఏప్రిల్ 7: పేదల సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని గొప్పలు చెప్పుకునే జగన్‌మోహన్ రెడ్డి సర్కారు పేదలకు అందించే నిత్యావసరాల్లో కోతలు విధిస్తూ వారిపై ఆర్థిక భారం మోపుతోంది. ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తుండగా కందిపప్పు మాత్రం సుమారు 8 నెలల నుంచి పంపిణీ చేయడం లేదు. ఉగాది పండుగ సందర్భంగా ఈనెలలో అయినా ఇస్తారని ఆశపడ్డ పేదల ఆశలు అడియాశలయ్యాయి. ఎనిమిది నెలలుగా ఇవ్వకపోయినా కనీసం ఏప్రిల్‌లో నిర్వహించుకునే ఉగాది పండుగకైనా రేషన్ వాహనాల ద్వారా కందిపప్పు ఇస్తారనుకున్న కార్డుదారులు ఆశలపై వైసీపీ ప్రభుత్వం నీళ్ల చల్లింది. పండుగ రోజైనా పప్పన్నం తినే భాగ్యం పేదలకు కల్పించలేదు. బహిరంగ మార్కెట్‌లో కిలో ధర రూ.160 నుంచి రూ.180 వరకు ఉంది. దాంతో పేదలు కొనలేకున్నారు. రైతు బజార్లలో కిలో రూ.160 వరకు అమ్ముతున్నా అది రెండో రకానికి చెందినది. ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత రావడంతో అన్నీ సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం డప్పు కొడుతోందన్న విమర్శలు ఉన్నాయి.

సొమ్ము సర్దుబాటు చేయలేకనే..

మండలంలోని రేషన్ కార్డుదారులకు కిలో రూ.67 చొప్పున కందిపప్పును రాయితీపై ఇవ్వాల్సి ఉంది. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.170 వరకు పలుకుతోంది. ఆ మేరకు పంపిణీ చేయాలంటే ప్రభుత్వం ప్రతినెలా లక్షల్లో రాయితీ మొత్తాన్ని కార్పొరేషన్‌కు అందించాల్సి ఉంది. ఈ సొమ్ము సర్దుబాటు చేయలేకనే చేతులెత్తేసినట్లు విశ్వసనీయ సమాచారం. పేదలు తిన్నా.. తినకపోయినా మా పని మేము చేసుకుంటూ పోతామన్నట్లు ప్రభుత్వ తీరు ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఈనెల తప్పక అందించాలని కార్డుదారులు కోరుతున్నారు.

కందిపప్పు బంగారమైంది..



ఈ ప్రభుత్వంలో కందిపప్పు బంగారంగా మారింది. రోజు వారీ కూలి పనులకు వెళ్లి ఆ డబ్బుతో నిత్యావసర సరుకులు కొని తింటున్నాము. రేషన్ దుకాణాల్లో బియ్యం, చక్కెర తప్ప ఇంకేమీ ఇవ్వడం లేదు. గత ప్రభుత్వంలో అన్ని రకాల నిత్యావసర సరుకులు తక్కువ ధరకే రేషన్ దుకాణాల్లో లభించేది.

- అమ్మణ్ణమ్మ, జి.రెడ్డివారిపల్లె

కందిపప్పు సరఫరా చేయాలి..



రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరా చేయాలి. తెలుగు ప్రజలకు కొత్త సంవత్సరాదిగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించుకునే ఉగాది పండుగకు పప్పన్నం తినడం ఆనవాయితీ. ఏప్రిల్ నెలలో తెలుగు ప్రజల ఉగా ది పండుగ ఉంది అని తెలిసి కూడా ఈ ప్రభుత్వం లో రేషన్ దుకాణాల్లో కందిపప్పు ఇవ్వకపోవడం బా ధాకరం. ఇతర దుకాణాల్లో కొనాలంటే కిలో రూ.180 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నారు. అంత డబ్బు పెట్టి కందిపప్పుకొనే స్థితిలో మేము లేము.

- నారాయణమ్మ, నీలంవాండ్లపల్లె

నిరుపేదల కడుపు కొట్టకండి..



తెలుగు ప్రజలు ఎంతో పవిత్రంగా నిర్వహించుకునే తెలుగు సంవత్సరాది (ఉగాది) పండుగకు పేద ప్రజలు తినే కందిపప్పు సరఫరా నిలిపివేయడం హాస్యాస్పదంగా ఉంది. జగన్‌మోహన్‌రెడ్డి పేదల కడుపు కొడుతున్నారు. సబ్సిడీ ధరకు పేదలకు కందిపప్పు అందించలేని దయనీయ పరిస్థితి ఈ ప్రభుత్వంలో ఉంది. రాష్ట్రంలోని అన్ని కులాలు, మతాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత టీడీపీది. ఈ ఉగాది ఈ ప్రభుత్వానికి చివరిది. టీడీపీ అధికారంలోకి రాగానే రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ చౌకదుకాణాల్లో నిత్యావసర సరుకులు అందుబాటులోకి తెస్తాము.

- సుగవాసి ప్రసాద్‌బాబు,
టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి

రెండు నెలలుగా సరఫరా లేదు..

రెండు నెలలుగా ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా లేదు. అంతకు ముందు ప్రభుత్వం నుంచి అందించారు. డీడీలు కట్టిన ప్రతి ఒక్క షాపుకు సరఫరా అందేది. ప్రభుత్వం నుంచి సరఫరా అందగానే డీడీలు కట్టించి పంపిణీ జరిగేలా చూస్తాము.

- హరి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, రాజంపేట

బాలసుబ్రమణ్యంకు సంపూర్ణ మద్దతు

- జనసేన నేత శ్రీనివాసరాజు వెల్లడి

రాజంపేట, ఏప్రిల్ 7: రాజంపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్న జనసేన నేత యల్లటూరి శ్రీనివాసరాజు తెలిపారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి జనసేన నేతల ఆత్మీయసభ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్న కార్యక్రమంలో శ్రీనివాసరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల జనసేన కార్యకర్తలు పెద్దఎత్తున ఆత్మీయ సభకు హాజరు కావడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. బాలసుబ్రమణ్యంకు తమ సంపూర్ణ మ ద్దతు తెలుపుతున్నామన్నారు. తా ను టికెట్టు కోసం ప్రయత్నించానని, అయినా సుగవాసి బాలసుబ్రమణ్యంకు తన మద్దతు ఇస్తూ ఆయనను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ జనసేన పార్టీ ఆత్మీయ సమావేశానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు హాజరు కావడం, తనకు సంపూర్ణ మద్దతు తెలపడం ఆనందంగా ఉందన్నారు. జనసేన నాయకులు తుంగా రమణయ్య, మాలే శివ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతు పలుకుతున్న జనసేన నేత శ్రీనివాసరాజు, తుంగా రమణయ్య తదితరులు

ఎంపీపీపై మరోసారి వలంటీర్ దాడి

- తలకు తీవ్ర గాయంతో ఆస్పత్రిలో చికిత్స

బి.కొత్తకోట, ఏప్రిల్ 7: బి.కొత్తకోట ఎంపీపీ లక్ష్మీనరసమ్మ కుటుంబీకులపై గుమ్మసముద్రం పంచాయతీ బుచ్చిరెడ్డిగారిపల్లెలో స్థానిక వలంటీర్ నరేశ్ అతడి కుటుంబీకులు శనివా రం దాడి చేసి గాయపరచగా ఆదివారం మరోసారి ఏకంగా ఎంపీపీపైనే దాడి చేసి తీవ్రంగా గాయపరచారు. వివరాలిలా ఉన్నాయి. బి.కొత్తకోట ఎంపీపీ మేదరి లక్ష్మీనరసమ్మ కుటుం బంతో కలిసి మండలంలోని బుచ్చిరెడ్డిగారిపల్లెలోని ఎస్సీ కాలనీలో నివాసం వుంటున్నారు. ఈ కాలనీలో ఉన్న 13 సెం ట్ల ప్రభుత్వ స్థలంలో గల చింతమాన్లను స్థానిక సర్పంచ్ చంద్ర ఇటీవల కోసివేశాడు. దీనిపై ఎంపీపీ లక్ష్మీనరసమ్మ అభ్యంతరం చెబుతూ కాలనీ వాసులతో కలిసి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం వలంటీర్ నరేశ్ మరికొం దరితో కలిసి ఎంపీపీ నివాసంపైకి దాడి చేసి ఎంపీపీ భర్త మేదరి నరసింహులు, మామ చిన్నాయప్పను గాయపరిచా రు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అదే కాలనీలో ఇరువర్గాల మధ్య మరోసారి వాదోపవాదాలు జరగ్గా ఎంపీపీ లక్ష్మీనరసమ్మనే టార్గెట్ చేసి దాడి చేశారు. కట్టెలతో తలపై కొట్టడంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. వెంటనే ఆమెను బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రిలో ఎంపీపీ మాట్లాడుతూ తన భర్త, తోడికోడలును గాయపరిచారు. నేను ఒక ఎంపీపీ అన్న గౌరవం కూడా లేకుండా దౌర్జన్యం చేస్తున్నారే.. అని ప్రశ్నించినందుకు వలంటీర్ నరేశ్‌తో పాటు అతడి కుటుంబీకులు కట్టెలతో కొట్టారని కన్నీటి పర్యంతమయ్యారు. ముందురోజు జరిగిన గొడవలో తమపై కేసు నమోదైందని తెలిసి కూడా ఏమాత్రం జంకు లేకుండా ఏకంగా ఎంపీపీనే చితకబాదారంటే వారి వెనుక పెద్దల హస్తం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. సీఐ సూర్యనారాయణ తన సిబ్బందితో బుచ్చిరెడ్డిగారిపల్లెకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. కాగా బుచ్చిరెడ్డిగారిపల్లెలో జరిగిన ఘటనలో వలంటీర్ నరేష్ వర్గీయులకూ గాయాలయ్యాయి. నరేశ్‌తో పాటు తల్లి మునెమ్మ గాయపడగా, తండ్రి నరసింహులు కూడా గాయపడి మదనపల్లె ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం జరిగిన గొడవకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.



చికిత్స పొందుతున్న ఎంపీపీ లక్ష్మీనరసమ్మ

గొర్రెపిల్లలపై కుక్కల దాడి

● రూ.3 లక్షలు నష్టం ● బాధితుల ఆవేదన



గొర్రెపిల్లల కళేబరాలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 7: దానవులపాడు వద్ద నుంచి పెన్నానదిలో సున్నపురాళ్లపల్లెకు వెళ్లే దారిలో ఆదివారం మధ్యాహ్నం గొర్రెపిల్లలపై కుక్కలు దాడిచేశాయి. గొర్రెపిల్లల యజమానులు దేవగుడి వాసి లావనూరు సుబ్బరాయుడు, సున్నపురాళ్లపల్లెకు చెందిన మేకల సుబ్బరాయుడు, మామా అల్లుడు. భోజనానికి ఇంటికి వెళ్లిన సమయంలో సంఘటన జరిగింది. మధ్యాహ్నం స్థానికంగా ఉన్న తోటల్లో ఉండే కుక్కలు గొర్రెపిల్లల వద్దకు వచ్చి జొరబడి దాడి చేశాయి. మొత్తం అక్కడ 70 గొర్రెపిల్లలు ఉండగా సుమారు 40 గొర్రెపిల్లలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి చంపాయి. ఈ దాడిలో గొర్రెపిల్లలు మొత్తం దాదాపు రూ.3 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు విలేకరులకు తెలిపారు.

పెన్షనర్స్ నాయకుడు దస్తగిరి మృతి



దస్తగిరి (ఫైల్‌ఫొటో)

జమ్మలమడుగు, ఏప్రిల్ 7: తాలూకా పెన్షనర్స్ గౌరవాధ్యక్షుడు పొన్నారి దస్తగిరి (79) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడు దస్తగిరి 1.7.1945లో జన్మించినట్లు జమ్మలమడుగు తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు దేవదానం తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారని చికిత్స పొందుతూ ఆయన మృతిచెందినట్లు తెలిపారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో పెన్షనర్ల కోసం భవనాన్ని నిర్మించడానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా మృతుడు దస్తగిరికి పెన్షనర్లు శ్రద్ధాంజలి ఘటించారు. ఈయన పొన్నారి శతకం, చాణక్యనీతి దర్పణం రాసి సహజ కవిగా స్థానికంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం కార్యదర్శి రామచంద్రారెడ్డి, సహాయ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముని సేవలో ఆర్టీఐ కమిషనర్



కోదండరామున్ని దర్శించుకున్న కమిషనర్

ఒంటిమిట్ట, ఏప్రిల్7: ఏకశిలా నగిరి కోదండరాముల వారిని స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగ మండపంలో మూలవిరాట్టు శ్రీసీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన ఆలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. టీటీడీ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

దేవుని కడప ఆలయంలో...

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 7: ఆంధ్రప్రదేశ్ సమాచారహక్కు చట్టం అమలు కమిషనరు చెన్నారెడ్డి ఆదివారం దేవుని కడపలోని ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మనోజ్ కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారి దేవానందకుమార్ తదితరులు ఉన్నారు

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న కాంట్రాక్టు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి



వైసీపీ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్న ఉద్యోగులు

వేంపల్లె, ఏప్రిల్ 7: ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే వైసీపీకి ప్రచారం, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న కాంట్రాక్టు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఎన్నికల అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కాంట్రాక్టు ఉద్యోగులపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పాల్గొన్న ఉద్యోగుల ఫొటోలను విలేకరులకు ఆయన విడుదల చేశారు. గండి దేవస్థానం, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ, వేంపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగులు ప్రసాద్, జావెద్, విజయ్, తేజేశ్వర్, గంగరాజు, అంజనేయులు, శివ కాంట్రా క్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, వీరంతా ప్రభుత్వం చేత జీతం తీసుకుంటూ వైసీపీ కి మద్దతుగా పనిచేయడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని వీరిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఒక వైపు ఐపీఎల్ మరో వైపు ఎన్నికల ఫీవర్



పోరుమామిళ్ల, ఏప్రిల్ 7: యువకులకు పరీక్షల ఫీవర్ ముగిసింది. వెనువెంటనే క్రికెట్ ప్రియులకు ఐపీఎల్, మరింత ముందుకెళితే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో ఎన్నికల ఫీవర్ మొదలైంది. గ్రామాల్లో సైతం యువకులు ఇంటి పట్టున కూర్చుండి టీవీలకు అతుక్కు పోతున్నారు. ఇదిలా ఉండగా పూర్తిగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక పోయినా, అభ్యర్థులు ఖరారు కాకముందే ఫలానా అభ్యర్థి గెలుపు అంటూ బెట్టింగ్ పెట్టేందుకు సిద్ధం అవుతోంది. నియోజకవర్గంలో ఓ అభ్యర్థి పార్టీ గుర్తు మారడం తో అవతల పార్టీ నేతలు జోరుగా ఉన్నారు. మొదటి నుంచీ అయోమయంలో ఉండి ప్రచార సమయంలో ఎడముఖం పెడముఖంగా ఉన్న నేతలు కలిసినట్టే కలిసి ఎవరికి వారే ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపధ్యంలో ప్రత్యర్థి వర్గం బలహీన పడిందని తమ అభ్యర్థి గెలుపు ఎవరూ ఆపలేరని మెజార్టీ పెద్దగా వస్తుంది అని ప్రచారం చేసుకుంటూ ఎవరైనా బెట్టింగ్ కడితే తాము సిద్ధంగా ఉన్నామని మధ్యవర్తుల ద్వారా సమాచారం చేరవేస్తున్నారు. నామినేషన్ల పర్వం ప్రారంభమే కాలేదు. అప్పుడే గెలుపు, మెజార్టీలపై పందేలు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇటీవల పార్టీ అభ్యర్థుల గెలుపుపై తర్జన భర్జనలు పడుతూ గెలుపు మీద కొందరు మెజార్టీ మీద మరికొందరు బెట్టింగ్ పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే ఐపీఎల్ ఫీవర్ గ్రామాలకు తాకింది. సాయంత్రం అవగానే యువకుల చేతుల్లోకి సెల్‌ఫోన్లు చేరిపోతున్నాయి. తాము నిర్ణయించుకున్న ప్రాంతాల్లో మాట్లాడుకుంటూ ఏటీం గెలుస్తుంది, క్రికెట్ ఎంత స్కోరు చేస్తారని బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నారు. వెయ్యి మొదలు స్థాయిని బట్టి ఎంత వరకైనా బెట్టింగ్‌లు పెట్టడానికి వెనకాడడంలేదు. వేసవి సెలవుల్లో ఎలాగూ పిల్లలు ఇంటి పట్టునే ఉన్నారు కదా అని భావిస్తున్నారే తప్ప వారి చేతల్లోని సెల్‌ఫోన్లతో ఏం చేస్తున్నారని వాటి మీద దృష్టిసారించడంలేదు. గేమ్స్ వైపు కూడా యువత ఆసక్తి కనబరచడం, సెల్‌లే తమ జీవితం, ప్రాణం, ఆటవిడుపు అంటూ సెల్‌ఫోనుల్లోనే నిమగ్నమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కొందరు ఈ క్రికెట్ బెట్టింగ్‌లకు వెనుకాడడం లేదు. గతంలో పోలీసు అధికారులు వీటిపై అవగాహన నిర్వహించినా కొందరిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించినా కొందరి ధోరణిలో మార్పు రావడం లేదు. పోరుమామిళ్లలోని కొన్ని ప్రాంతాల్లో యువకులు తమ సెల్‌ఫోన్ల ద్వారా మెసేజ్‌లు అందించుకుంటూ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు మెండుగా ఉన్నాయి.

ఇప్పటికైనా పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించి వారి అలవాట్లపై దృష్టి పెట్టి బెట్టింగ్‌లకు దూరంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోలీసు అధికారులు కూడా బెట్టింగ్ రాయుళ్లపై ప్రత్యేక నిఘా ఉంచి మొదటి దశలోనే వీటికి కళ్లెం వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డిని వివరణ కోరగా, గతంలో పదిమంది బెట్టింగ్ రాయుళ్లను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ కూడా చేయించామన్నారు. ఆ బెట్టింగ్‌లకు పాల్పడేవారు ఎవరైనా ఉంటే చర్యలు తప్పవని ఎక్కడైనా జరుగు తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తెస్తే వారిపై చర్యలు తీసుకుంటామని సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆటో కార్మికులందరికీ ఇంటి స్థలాలు

టీడీపీలో చేరిన 150 మంది ఆటో కార్మికులు ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి భరోసా



ఆటో కార్మికులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

కడప (మారుతీనగర్) ఏప్రిల్ 7: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే కడప నగరంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న కార్మికులందరికీ ఇంటి స్థలాలను వచ్చేలా చేస్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ చిట్టిబోయిన సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నగరానికి చెందిన సుమారు 150 మందికి పైగా ఆటో కార్మికులు ఆర్. శ్రీనివాసరెడ్డి, టీడీపీ, కడప అసెంబ్లీ అభ్యర్థి ఆర్. మాధవిరెడ్డి సమక్షంలో ఆదివారం స్థానిక ద్వారకానగర్‌లోని ఆయన స్వగృహం వద్ద టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవచ్చేది టీడీపీ ప్రభుత్వమని, సమాజానికి సేవలందిస్తున్న ఆటో కార్మికులంతా తమ న్యాయమైన హక్కుల సాధనకోసం సంఘటితంగా వుండేలా ఒక యూనియన్ ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వం నుంచి ఆటో కార్మికులకు అందాల్సిన సంక్షేమ ఫలాలను అర్హులైన కార్మికులందరికీ వర్తించేలా చేస్తామన్నారు. ఇప్పటికీ కొందరు సొంత ఆటోలేక బాడుగకు ఆటో వేస్తూ జీవనం సాగిస్తున్న వారికి కూడా ఫలాలు అందేలా చూస్తామన్నారు. ముఖ్యంగా నగరంలో వివిధ కూడళ్ళవద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వుండేలా ప్రత్యేకంగా ఆటో స్టాండ్స్ కల్పించేలా చేస్తామన్నారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు, లైసెన్సులను అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానంగా ప్రతి ఆటో కార్మికులందరికీ సొంత డబ్బు పెట్టి మరీ 5 లక్షల బీమా(ఇన్సూరెన్స్) సౌకర్యం కల్పించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. కావున ఆటో కార్మికులంతా టీడీపీకి ఓట్లు వేసి కడప అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో వున్న ఆర్. మాధవిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో నేతలు దస్తగిరి, మస్తాన్, సునీల్‌బాబు, నగేష్, రమేష్, తోపాటుగా టీడీపీ నేత శివారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఎన్నికలే పునాది

పౌరుల చైతన్యమే ప్రజాస్వామ్యానికి రక్ష ● ఓటు హక్కును అమ్ముకోకూడదు

● అభ్యుదయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతురెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అభ్యుదయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతురెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 7: ప్రజాస్వామ్యానికి ఎన్నికలే పునాదులు అని అభ్యుదయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిరెడ్డి హనుమంతుతెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన అఖిలభారత అభ్యుదయ వే దిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అత్యుత్తమమైన పాలన విధానమని, దానిని కాపాడుకోవలసిన అవసరం ప్రజలందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై ఓటు హక్కు అమ్ముకోకుండా సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని సామాన్యులకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండాపోయిందన్నారు. ప్రజలు ఓటు హక్కు విలువను తెలుసుకుని దానిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వాల పాలన ప్రజల అభివృద్ధికి తోడ్పడేదిగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. రాష్ట కమిటీ సభ్యుడు సురేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరయ్య మాట్లాడుతూ రాజకీయ పార్టీల మేనిఫెస్టో మాత్రమే కాదు అభ్యర్థులు కూడా తమ నియోజకవర్గం అభివృద్ధికి సంబంధించిన మేనిఫెస్టో ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అభ్యుదయ వేదిక ప్రతినిధులు సీవీ సుధాకర్, హైదర్‌వల్లి, కె.గౌరీశంకర్, ఎం.శ్రీనివాసులు, ఎన్నికల నిఘావేదిక నాయకులు ఎస్.అరుణ్, దేవరక్రిష్ణ, జి.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో కుటుంబ సభ్యుల అరెస్ట్

కాశినాయన ఏప్రిల్ 7: వరకట్నం వేధింపుల కేసులో భర్త జాజం సిద్దులు, మామ జాజం ఎల్లోజి, అత్త జాజం క్రిష్ణవేణి మరదులు శివ,బాలును శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అమర్‌నాధ్‌రెడ్డి తెలిపారు. కాశినాయన మండలం కొండ్రాజుపల్లెలో ఇటీవల ఉరివేసుకుని చనిపోయిన కుమారి సునీత(23) కేసులో అనుమానితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. తెలంగాణలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సిద్దులుతో రెండేళ్ల కిందట సునీతకు వివాహమైంది. వివాహమైన 3 నెలల నుంచే అదనపు కట్నంకోసం వేధింపులు మొదలయ్యాయని వారి వేధింపులు భరించలేక ఆమె బలవన్మరణానికి పాల్పడినట్లు మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు వారిని రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసరి సమీప అన్నోజిగూడలో అరెస్ట్ చేసి రాత్రి మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేసులు ఎదుట హాజరు పరిచి అరెస్ట్ చూపి అనంతరం ఆదివారం బద్వేల్ కోర్టులో హాజరు పరిచామన్నారు.

మూడు ట్రాక్టర్లు పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

ఖాజీపేట, ఏప్రిల్ 7: అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైదుకూరు రూరల్ సీఐ రామాంజులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆమేరకు ఒక ఇసుక ట్రాక్టరు, రెండు మట్టి ట్రాక్టర్లను పట్టుకుని ఇసుక ట్రాక్టర్‌ను మైన్స్ అధికారులకు, మట్టి ట్రాక్టర్లకు తహసీల్దారుకు అప్పగిస్తున్నామన్నారు. అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు

వడదెబ్బతో వృద్ధురాలు మృతి



బద్వేలు టౌన్, ఏప్రిల్ 7: మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో పీరమ్మ (70) ఆదివారం వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎండ తీవ్రత తట్టుకోలేక అస్వస్థతకు గురై మధ్యాహ్నం మృతి చెందినట్లు వారు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ముద్దనూరు ఏప్రిల్7: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గుర్తుతెలియని (70) వృద్ధుడు శనివారం మృతి చెందినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మార్చి 31న పులివెందుల రహదారి నల్లబల్లె సమీప పుల్లేరు వంక వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

కవులు సమాజ శ్రేయస్సును కాంక్షిస్తారు

వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఈశ్వర్‌రెడ్డి



కవులను సత్కరిస్తున్న రాయలసీమ టూరిజం సంస్థ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 7: కవులు సమాజ శ్రేయస్సును కాంక్షిస్తారని, ఉత్తమ సమాజం ఎలా ఉండాలో సూచిస్తారని, నైతిక విలువతో కూడిన సమాజం ఆరోగ్యకరమైనదిగా భావిస్తారని వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఉగాది కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ కవులు సమాజానికి దిశ నిర్దేశనం చేయగలరని నిరంతరం సమాజ శ్రేయస్సు కోసమే తపిస్తారన్నారు. అనంతరం డాక్టర్ భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, రమణారెడ్డి, కల్లూరు బాల యల్లారెడ్డి, మధుబాబు ఉగాది కవితలను వినిపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సంస్థ పేట్రన్ చంద్రారెడ్డి విజయకుమార్‌బాబు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణార్పణం..

● చెరువులు నింపకుండా కాలువ పారించారు

● కుప్పం తరలించేందుకు అధికారుల యాతన

● అలా చూపి ...ఇలా ఆపేశారు

● ఎన్నికల స్టంట్ అంటూ అభివర్ణిస్తున్న జనం



బి. కొత్తకోట శివారులో చుక్కనీరు లేక బోసిపోయిన హంద్రీ-నీవా కాలువ



ఇటీవల కుప్పం వైపుకు ఈ కాలువ గుండా ప్రవహించిన కృష్ణాజలాలు

బి కొత్తకోట, ఏప్రిల్ 7: 'కుప్పంకు కృష్ణాజలాలు తరలించేస్తున్నాం. చెరువులు నింపేస్తాం. వ్యవసాయ భూములు సస్యశ్యామలం చేసేస్తాం.. ఇది మావల్లే సాధ్యం' అని జగన్‌రెడ్డి ప్రభుత్వం బీరాలు పలికినప్పటికీ అది కేవలం ఎన్నికల స్టంట్‌గానే మిగిలిపోయింది అనేది ప్రజలమాట. హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచి కెనాల్ పరిధిలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాలలో 91 చెరువులకు కాలువద్వారా కృష్ణాజలాలు అందించాల్సివున్నా ఆ ప్రయత్నం ఏదీ జరగలేదు. కుప్పంలో నీటిని చూపితేచాలు అన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చేందుకు హెచ్ ఎన్ఎస్ఎస్ అధికారులు తంటాలుపడుతూ, యాతన అనుభవించారు. వేలకోట్లు ఖర్చు చేసి హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువను నిర్మించారు. నాలుగేళ్లుగా ఎత్తిపోతల పథకాలు, కాల్వ నిర్వహణకు రూపాయి విదల్చని ప్రభుత్వం ఎన్నికల ఏడాదిలో మరోసారి హంద్రీ-నీవా జలాలను తీసుకొచ్చి హడావిడి చేశారు.

టీడీపీ హయాంలోనే జిల్లాకు హంద్రీ-నీవా జలాలు

హంద్రీ-నీవా సుజల స్రవంతి కర్నూలు జిల్లాలోని శ్రీశైలం ప్రాజెక్టు నుంచి అనంతపురం జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయరుకు, అక్కడినుంచి శ్రీసత్యసాయి జిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లి రిజర్వాయరుకు తరలుతుంది. అక్కడినుంచి పుంగనూరు బ్రాంచికెనాల్ ద్వారా అన్నమయ్య, చిత్తూరు జిల్లాల మీదుగా పలమనేరు సమీపంలోని అప్పినపల్లి వద్దకు అక్కడి నుంచి కుప్పం బ్రాంచికెనాల్ ద్వారా పరమసముద్రం వరకు 743 కిలోమీటర్లు ప్రవహించి కుప్పంకు నీరు చేరాల్సివుంది. దీనికోసం 8ప్యాకేజీలు, 38 లిఫ్టులు ఏర్పాటు చేశారు. చెర్లోపల్లి రిజర్వాయరు నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనికి పుంగనూరు బ్రాంచి కెనాల్ ద్వారా టీడీపీ హయాంలోనే నీటిని పారించారు. కొన్ని చెరువులకూ నీటిని విడుదల చేశారు. కాలువనిర్మాణం కోసం మదనపల్లె వద్ద 3కిలోమీటర్ల సొరంగం, కుప్పం ఉపకాలువ కు పలమనేరు బైరెడ్డిపల్లి మండలాల్లో సొరంగాలు తవ్వించారు.

కుప్పం బ్రాంచ్‌కెనాల్‌కు అప్పట్లోనే రూ.144 కోట్లు

పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లి నుంచి ప్రారంభం అయ్యే కుప్పం బ్రాంచ్‌కెనాల్ నిర్మాణం పూర్తి అయినా అదనపు మట్టిపనులు, కాంక్రీటు నిర్మాణాలకు అదనంగా 2018లో జీవో నంబరు 32 తీసుకొచ్చి రూ.144.7 కోట్లు విడుదల చేసింది. దీంతో కుప్పం బ్రాంచి కెనాల్ పనుల విలువ రూ.574 కోట్లకు చేరింది. 123 కి.మీలు సాగే ఈ బ్రాంచ్‌కెనాల్‌పై శంకర్రాయలపేట, పసుపత్తూరు, ఆదినేపల్లి వద్ద ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని పంపింగ్ చేస్తారు.

చెరువులు నింపడంలో చిత్తశుద్ధి ఏదీ..

వైసీపీ హయాంలో రెండుసార్లు హంద్రీ-నీవా నీటిని జిల్లాకు తరలించినా స్థానికంగా ఉన్న చెరువులను నింపాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వంలో కనిపించలేదనే విమర్శలు వున్నాయి. ఎన్నికల నేపథ్యంలో కుప్పంకు తాము ఏదో చేసేశాము అని అక్కడి ఓటర్లకు భ్రమ కల్పించడానికి మాత్రమే హంద్రీ-నీవా జలాలు ఆవిరి అయిపోయాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,80,450ఎకరాలకు సాగునీరు, 15లక్షల మందికి తాగునీరు అందించాలన్నది ప్రాజెక్టు లక్ష్యం. రూ.2,905 కోట్ల అంచనాతో ప్రారంభమై, పూర్తి అయ్యేనరికి 3,900 కోట్లకు పైగా ఖర్చు అయింది. మదనపల్లి డివిజన్‌లో 92 చెరువులను హంద్రీ-నీవా ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం ఆ దిశగా తీసుకున్న చర్యలు శూన్యం.

కృష్ణా జలాలు గాలికి ఆవిరి..

చెర్లోపల్లి రిజర్వాయరు నుంచి 7 లిఫ్టుల ద్వారా పుంగనూరు బ్రాంచి కెనాల్ మీదుగా అప్పినపల్లెకు, అక్కడి నుంచి కుప్పం ప్రాంతంలోని పరమసముద్రం చెరువుకు నీటిని తరలించేందుకు రెండునెలలు పట్టింది. ఎండవేడికి నీరు ఆవిరి అయిపోవడం, కాలువలో ఇంకిపోవడంతో చెర్లోపల్లినుంచి 150-200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినా కుప్పంకు 10 క్యూసెక్కులు కూడా చేరలేదు. సుమారు 400కి.మీ.లు దూరం ప్రవహించాల్సివున్నందున నీరు వేగంగా ముందుకు సాగలేదు. చెర్లోపల్లి రిజర్వాయరు నీటినిల్వ సామర్థ్యం 1.618టీయంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 0.4 టీయంసీలకు పడిపోయింది. శ్రీశైలం నుంచి నీటి లభ్యత తగ్గడంతో లిఫ్టింగ్‌ను ఆపేశారు. కుప్పం చేరిన నీరు సీయం పర్యటన హడావిడి మాత్రమే కనిపించి ఆ తర్వాత కాలువ బోసిపోయింది.

ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో జగన్‌కు షాక్

● టీడీపీలో చేరనున్న మండల నాయకులు

ఒంటిమిట్ట, ఏప్రిల్7 : ఒంటిమిట్ట, సిద్దవటంకు చెందిన పలువురు వైసీపీ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు సోమవారం టీడీపీ పార్టీలో చేరనున్నారు. టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబుతో రెండు రోజులుగా వారితో చర్చించి టీడీపీలోకి ఆహ్వానించారు. సోమవారం వారు హైదరాబాదులో నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరనున్నారు. చింతరాజుపల్లి కి చెందిన సీనియర్ నాయకులు బొడ్డే వెంకటరమణ, నరవకాటిపల్లెకు చెందిన సర్పంచ్ వెంకటరెడ్డి, గంగపేరూరు ఎంపీటీసీ చాపల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ కట్టా నారాయణ, సిద్దవటం మండలానికి చెందిన మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ జోహార్‌బాషా, జ్యోతి గ్రామానికి చెందిన జ్యోతి ప్రసాద్‌రెడ్డి, మాచుపల్లి మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి, ఉప్పరపల్లి సర్పంచ్ బాలాజీ, పొన్నవోలు కొత్తపల్లి చెందిన సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, మాధవరానికి చెందిన జాన తోటి నారాయణరెడ్డి, భాకరాపేట ఉపసర్పంచ్ నాగ నరసింహారెడ్డి, తుర్రా ప్రతాప్ పలువురు ద్వితీయశ్రేణి నాయకులు వైసీపీ నుంచి టీడీపీలో చేరనున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. దీంతో టీడీపీలో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

సిద్దవటం, ఏప్రిల్ 7: సిద్దవటం మండలానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సత్య నారాయణ రెడ్డి, బండి గంగా నందరెడ్డి, గంగిరెడ్డి, క్రాంతి కు మార్ రెడ్డి రామచంద్రారెడ్డి, నాగా ర్జున నాయుడు తదితరులు ఆదివారం రాజంపేట తెలుగు దేశం పార్టీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కించాల సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు వైసీపీ ప్రభుత్వంలో విలు వ లేదన్నారు. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వలం టరీ వ్యవస్థ కారణంగా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులకు విలువలేకుండా పోయిందన్నారు. వైసీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధి లేకపోగా, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో పేద బలహీన వర్గాల ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు కార్యదర్శి నాగముని రెడ్డి, రాజంపేట నియో జకవర్గ యువ నాయకులు రాజానాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గంజి సుబ్బరాయుడు, అయ్యప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అరికట్టాలి

రాజంపేట టౌన్, ఏప్రిల్7 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని జైభారత్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఖాదిజ్ఞాసి యోధ వంశీ చౌడవరం, ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు పందికాళ్ల జయరాం అన్నారు. జైభారత్ జస్ట్ ఓట్ ఆంధ్రప్రదేశ్ క్యాంపెయిన్ కమిటీ 2024 కార్యక్రమాన్ని ఆదివారం రాజంపేట పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బోయనపల్లెలోని హరిత హోటల్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ఎన్నికలే అతి పెద్ద పండుగని అన్నారు. డబ్బుకో, మద్యానికో ఓటు హక్కును అమ్ముకోవడం వల్ల ప్రశ్నించే హక్కును కోల్పోతున్నారన్నారు. ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా, దేశ భవిష్యత్తు కోసం ఉత్తమమైన నాయకుడిని ఎన్నుకునేందుకు పవిత్రమైన ఓటును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో జస్ట్ ఓట్ కమిటీ జిల్లా కో-ఆర్డినేటర్ పి.చెంగల్ రాయుడు, ఖాదిజ్ఞాసి కట్టా శ్రీనివాసులు, వంశీ చౌడ వరం, ఎస్.సి.పోరాట వేదిక సభ్యులు లింగం జయరాం, మన్యం రమణ, ఇరువూరి శ్రీను, లక్ష్మీ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం


వాల్మీకిపురం, ఏప్రిల్ 7: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరాముడి ఆలయంలో ఆదివారం కోయిల్‌ఆల్వార్ తిరుమంజనం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ప్రతియేటా పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు ముందు చేపట్టే కార్యక్రమాలు టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయాత్పూర్వం సుప్రభాత సేవతో మొదలు ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాల సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ గర్భగుడిని సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేశారు. ఐదు రోజుల్లో పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా ఆలయ ప్రాంగణం సర్వాంగసుందరంగా ముస్తాబవుతోంది. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భాషికాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఏప్రిల్ 7:మండలంలోని చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతాన లక్ష్మిగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేతలకు సెంటిమెంట్.. రాజుగుంట

● ఇక్కడ ప్రచారం ప్రారంభిస్తే విజయం సిద్ధిస్తుందని నమ్మకం
● ఐదు మండలాలకు ఈశాన్య దిశగా ఉండడమే కారణం
● ప్రచారం ప్రారంభించిన జనసేన అభ్యర్థి


రాజుగుంట గ్రామం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 7: ఆ ఊరి పేరు రాజుగుంట. చిట్వేలి మండలంలోని ఈ గ్రామం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ఈశాన్యంలో ఉండడంతో రాజకీయపార్టీల నాయకులు ఈ గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తుంటారు. చాలా ఏళ్లుగా ఈ గ్రామం నేతలకు సెంటిమెంట్‌గా మారింది. రాజంపేట నుంచి రాపూరుకు వెళ్లే మార్గంలో రాజుగుంట గ్రామానికి వెళ్లే క్రాస్‌రోడ్డు వద్ద అంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి, అనంతరం రాజుగుంటలోని గంగమ్మ, సీతారాముల ఆలయాల్లో పూజలు చేసి ప్రచారం ప్రారంభించడాన్ని రాజకీయ నేతలు ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఈ ఆనవాయితీ 2009 నుంచి ఆనవాయితీ గా మారింది.

రాజుగుంట పంచాయతీలో ఒకే సామాజిక వర్గానికి చెందిన సుమారు 500 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామం భౌగోళికంగా రైల్వేకోడూరు, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాలకు ఈశాన్య దిశలో ఉంది. ఇక్కడి నుంచి ఏ పని చేపట్టినా ఉత్తమ ఫలితాలు సాధిస్తారని రాజకీయ నేతల నమ్మకం. ఈ నేపథ్యంలో రాజుగుంట పంచాయతీలో ప్రచారం ప్రారంభించి సమీపంలో ఉన్న చింతలచెలికలో పూర్తి చేయడం ఆనవాయితీగా వస్తోంది. చింతచెలిక, రాజుగుంట ప్రాంతాల్లో సాధువులు, మునులు తపస్సు చేసుకునేవారని స్థానికులు చెబుతుంటారు. ఈ ప్రాంతాల్లో వేమన కూడా సంచరించినట్లు చెబుతారు. కాగా, ప్రస్తుతం కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్ ఇక్కడి నుంచే ప్రచారం ప్రారంభించారు.

టీడీపీ విజయంలో కీలకపాత్ర పోషిస్తాం

● సుగవాసికి ముస్లింల భరోసా ● ఇఫ్తార్ విందుకు భారీగా హాజరు


ఇఫ్తార్ విందు ఇస్తున్న టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం


స్వాగతం పలుకుతున్న పిడికిటి సంతోష్ నాయుడు తదితరులు

రాజంపేట, ఏప్రిల్ 7 : టీడీపీ విజయంలో కీలకపాత్ర పోషిస్తామని పలువురు ముస్లింలు స్పష్టం చేశారు. పట్టణంలోని ఏబీ చంద్రారెడ్డి కల్యాణ మండప ప్రాంగణంలో సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆదివారం సాయం త్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందు సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ముస్లింలు ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా రాజంపేట పట్టణ తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అబూబకర్ తదితరులు మాట్లాడుతూ ఇఫ్తార్‌విందుకు వేలాదిగా ముస్లింలు రావడం ముస్లింలు టీడీపీ వైపు ఉన్నారనడానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు జాఫర్ అలీ, షేక్ షాహిద్, ఎస్.కె.కరీం, షేక్ మౌలానా, పీరు సాహెబ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, రాజంపేటమండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ అధ్యక్షుడు కొండయ్య నాయుడు, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్, ఒంటిమిట్ట మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, సుబ్రమణ్యంనాయుడు ,వెంకటేశ్వర్లనాయుడు, జన సేన పార్టీ నాయకులు అతికారి దినేష్, కత్తి సుబ్బరాయుడు, పిడికిటి సంతో ష్ నాయుడు, మహేష్ నాయుడు, కాకతీయ సేవా సమితి జిల్లా అధ్యక్షులు శివకుమార్ చౌదరి, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, మనుబోలు వెంక టేశ్వర్లు, ప్రముఖ రియల్టర్, టీడీపీ యువ నాయకులు దొంతం శివ పాల్గొన్నారు.

రాజంపేటలో సుడిగాలి పర్యటన

రాజంపేట ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆదివారం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. పట్టణంలోని టీడీపీ యువ నాయకులు పిడికిటి సంతోష్ నాయుడు ఆధ్వర్యంలో సుగవాసికి ఘ నంగా స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా పెద్దఎత్తున నాయకులు హాజరయ్యారు. సంతోష్ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు విజయకుమార్ చౌదరి, టీడీపీ రైల్వేకోడూరు నియోజకవర్గ నాయకులు అజయ్‌బాబు, సీనియర్ టీడీపీ నాయకులు మాలేపాటి రామకృష్ణనాయుడు, నాగేశ్వర నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ జెడ్పీటీసీ సరస్వతి, మహిళా నేతలు పిడికిటి రత్నమ్మ, సునంద తదితరులు హాజరయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు నేతలు సుగవాసివద్దకు వచ్చి తమ మద్దతు తెలియజేశారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్ల నాయుడు, దొంతం శివ, కొండయ్య నాయుడు తదితరులు హాజరయ్యారు.

చంద్రబాబుతోనే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి

● రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


ఇంటింటి ప్రచారం సందర్భంగా ప్రజలతో రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం, ఏప్రిల్ 7: తెలుగుదేశం పార్టీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లె పంచాయతీ మంగళపల్లి, హరిజనవాడ, చిన్నకోడివాండ్లపల్లె, నడింపల్లి, ఎగువకొవ్వూరువాండ్లపల్లె, దిగువ కొవ్వూరువాండ్లపల్లి, కొవ్వూరువాండ్లపల్లె, బీదవాండ్లపల్లె, సరస్వతిపల్లె పంచాయతీలో హరిజనవాడ, నాయునివారి పల్లె, ఉడుంవారిపల్లె, సరస్వతిపల్లి కస్పాలో ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సరస్వతిపల్లిలోని భాస్కర్‌రెడ్డి ఇంట్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార దర్పంతో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, వైసీపీ నాయకులు టీడీపీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అలాంటివి తన దృష్టికి వస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. టీడీపీ కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు గడికోట భాస్కర్‌రెడ్డి, చెన్నూరు బాబు, వెంకట్రమణనాయుడు, కదిరప్పనాయుడు, రఘునాథ నాయుడు, అన్నమయ్య, శివయ్య, వెంకట్రామరాజు, చిట్టి రెడ్డెయ్య, నాగభూషణ్‌రెడ్డి, గురిగింజకుంట గంగాధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపండి

● రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు


ప్రచారం చేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

సుండుపల్లె, ఏప్రిల్ 7: అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. ఆదివారం సుండుపల్లె మండలంలోని జీ. రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కి రణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను రానున్న ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల శేయస్సు కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారని అలాంటి మహోన్నత వ్యక్తికి నియోజకవర్గ ప్రజలందరూ అండగా నిలవాలని ఓటర్లను అభ్యర్థించారు. తమ తండ్రి సుగవాసి పాలకొండ్రాయుడు గెలుపులో సుండుపల్లె మండల ప్రజలు అండగా నిలిచారని, ఇప్పుడు రాజంపేట టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన సోదరుడు సుగవాసి బాలసుబ్రమణ్యంకు ఘన విజయాన్ని అందించాలని కోరారు. కనీస సమస్యలు పరిష్కరించలేని దౌర్భాగ్య ప్రభుత్వం అధికారంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపల్లెలో యువకులు ఉద్యోగ అవకాశాలు లేక ఇంటికే పరిమితమయ్యారన్నారు.

వైసీపీ విద్యార్థి విభాగం సెక్రటరీ టీడీపీలో చేరిక

వైసీపీ అన్నమయ్య జిల్లా విద్యార్థి విభాగం సెక్రటరీ కలిశెట్టి మనోహర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం జీ. రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీ పర్యటన సందర్భంగా ఆయన టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే అందరికీ మంచి జరుగుతుందన్న లక్ష్యంతో టీడీపీలో చేరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెన్న, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్ నాయుడు, చప్పిడి రమేశ్‌నాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, మాజీ సర్పంచ్ నాగయ్య, వెంకట్రమణ, రామాంజులు, మాలేపాటి సురేశ్‌నాయుడు, ప్రతాప్‌రెడ్డి శివరామ్‌నాయుడు, ప్రసాద్‌రాజు, దామోదర్‌నాయుడు, చంద్రశేఖర్‌రాజు, మోహన్‌బాబునాయుడు, వెంకట్రమణ, రెడ్డినాయక్, నాగ సుబ్బయ్య, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి, రామశ్రీనివాస్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

లయన్స్ కంటి ఆసుపత్రిలో 15 వేల ఆపరేషన్లు


అభినందన సభలో మాట్లాడుతున్న వైద్యుడు బయారెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 7: చెన్నముక్కపల్లె గ్రామంలోని లయన్స్ కంటి ఆసుపత్రి ద్వారా 15 వేల ఆపరేషన్లను దిగ్విజయంగా పూర్తి చేయడం గొప్ప కార్యక్రమం అని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బలరామ రాజు అన్నారు. ది రాచవీడు లయన్స్ హ్యూమానిటీ సర్వీస్ ట్రస్ట్, మాజీ ఎంపీ లయన్ వైఎస్ వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో 2009లో ప్రారంభమైన లయన్స్ కంటి ఆసుపత్రి 15 వేల ఆపరేషన్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి చైర్మన్ లయన్ వైవీఆర్ స్వరూపగుప్త దంపతులను సత్కరించారు. అనంతరం డాక్టర్లు బలరామరాజు, బయారెడ్డి మాట్లాడుతూ రాయచోటి లాంటి వెనుకబడిన ప్రాంతంలో కంటి ఆసుపత్రి ఏర్పాటు చేసి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇంతటి గొప్ప కృషి చేసిన కంటి ఆసుపత్రి చైర్మన్‌తోపాటు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, చెన్నముక్కపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడి వైద్యులు సంగమ్మ, మహేశ్వర్‌రాజు, శ్రీనివాసకుమార్‌రాజు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి, కంటి ఆసుపత్రి కోశాధికారి శివప్రసాద్‌రెడ్డి, ప్రముఖ దాత లయన్ మిఠాయిగిరి ఖాసీంసాహెబ్‌తో పాటు దాతలు, క్లబ్ సభ్యులు, ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో కంటి ఆసుపత్రి అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. అనంతరం కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి 9 మందికి ఆపరేషన్‌లు నిర్వహించారు.

గెలుస్తాం.. చరిత్ర సృష్టిస్తాం

●రాజుకుంట నుంచి జనసేన ప్రచారం ప్రారంభం


చింతలచెలికలో ప్రచారం చేస్తున్న నాయకులు

చిట్వేలి, ఏప్రిల్7 : వైసీపీ అరాచకాలను ఎండగట్టి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిని గెలిపించి చరిత్ర సృష్టిస్తామని రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని చింతలచెలిక, రాజుకుంటలో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా చిట్వేలి టీడీపీ కార్యాలయంలో పూజలు చేశారు. అనంతరం సర్పంచ్‌గుత్తి నరసింహ, ఎంపీటీసీ నాగార్జున వారికి స్వాగతం పలికారు. చింతలచెలికలోని నడివీధి గంగమ్మకు పూజలు చేసి ప్రచారాన్ని మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రూపానందరెడ్డి, సీనియర్ పార్టీ నాయకులు కస్తూరి విశ్వనాథ నాయుడు, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ ఐదేళ్లలో రాష్ట్రాన్ని వైసీపీ అన్ని విధాలా దోచుకుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇసుక, మద్యం, డ్రగ్స్ మాఫియా పెరిగిపోయిందన్నారు. ప్రజా వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనను సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నాయకులు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయకులు ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. కరెంటు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలను పీడిస్తున్నారన్నారు. రైల్వే కోడూరు జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. అభ్యర్థి అరవ శ్రీధర్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పవన్‌కల్యాణ్ రైల్వేకోడూరు టికెట్టు ఇచ్చారని ఆయన నమ్మకాన్ని నిలబెడతామన్నారు. ప్రజలు గర్వపడేలా అభివృద్ధి పనులు చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తానా మాజీ ప్రెసిడెంట్ టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి వేమన సతీష్, నియోజకవర్గ పరిశీలకులు హేమాంబర రావు, పారిశ్రామిక వేత్త విశ్వేశ్వర నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కె.కె.చౌదరి, జోగినేని మణి, పగడాల వెంకటేష్, ముక్కా వరలక్ష్మీ, సాయి వికాస్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు కృష్ణయ్య నాయుడు, గుండయ్య నాయుడు, లారీ సుబ్బరాయుడు, అనంతయ్య యాదవ్, పూలల రమేష్, జనసేన నాయకులు మాదాసు నరసింహ, ఏదోటి వెంకటేష్, రాష్ట్ర బీసీ నాయకులు ఎన్.రమణ, కమతం నాగరాజు యాదవ్, బీజేపీ నాయకులు, టీడీపీ జనసేన మండల నాయకులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: పట్టణంలోని బలిజవీధిలో ఉన్న గంగమ్మ ఆలయంలో ఆదివారం టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ పూజలు చేశారు. తాను ఎన్నికల్లో గెలవాలని కొబ్బరి కాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు యువత యెలిశెట్టి శంకర్, కొప్పరపు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ముక్కా సైన్యం

ఓబులవారిపల్లె, ఏప్రిల్7 : రైల్వేకోడూరు టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అరవ శ్రీధర్‌తో తెలుగుదేశం రైల్వేకోడూరు ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి అనుచరులతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించడానికి చిట్వేలి మండలంలోని రాజుకుంటకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి అరవ శ్రీధర్‌కు జనసైనికులు స్వాగతం పలికారు. నియోజకవర్గం నలు మూలల నుండి భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బయలుదేరారు.

జనసేన ప్రచారానికి కదిలిన టీడీపీ నేతలు


చిట్వేలిలో ప్రచారానికి బయలుదేరిన టీడీపీ నాయకులు


ఓబులవారిపల్లె, ఏప్రిల్ 7 : జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చప్పిడి రమేష్‌బాబు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రైల్వేకోడూరు నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగుర వేయడానికి నియోజకవర్గ వ్యా ప్తంగా అన్ని వర్గాలు, కులాల వారిని కలుపుకుని జనసేన పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తామని తెలిపారు. మండ లంలోని తెలుగుదేశం నాయకులు, తెలుగు యవత ఆధ్వర్యంలో చిట్వేలి మండలంలోని రాజుకుంటలో ప్రారంభం అయ్యే ప్రచార కార్యక్రమానికి మండల నాయకులు భారీ ఎత్తున తరలివెళ్లినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని మట్టిలో కలిపి టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని మండల టీడీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.కమ్మపల్లి సర్పంచ్ చప్పిడి సురేష్‌బాబు, మాజీ సర్పంచ్ జనార్ధన్ నాయుడు, తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి నరేష్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం


అవులశెట్టివారిపల్లెలో ప్రచారం చేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

గాలివీడు, ఏప్రిల్ 7: రాయచోటి నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని గోరాన్‌చెరువు పంచాయతీలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం గాలివీడు మండలానికి చేసింది శూన్యమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందని, అభివృద్ధి కూడా జరిగిందని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలను అమలు చేసి బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు, మాజీ ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌రెడ్డి, చెన్నయ్య, శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, అప్పరెడ్డి, నాగేశ్వరరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు


ఓబులవారిపల్లె: నల్లారిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు

సంబేపల్లె, ఏప్రిల్7: మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని సంబేపల్లె తెలుగుదేశం పార్టీ మండల టీడీపీ నాయకులు రెడ్డిమల్లు బాబురెడ్డి, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి అశోక్ చౌదరి కలికిరిలోని ఆయన స్వగృహంలో ఆదివారం కలిశారు. అనంతరం శాలువా కప్పి సత్కరించారు. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని తెలియజేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకులు ముళ్లగూరి మోహన్‌నాయుడు, శంకర, బాలాజీనాయుడు, అనంత్ పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: రాజంపేట ఎంపీ అభ్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని మండల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి ఎంపీ అభ్యర్థి, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో నియోజకవర్గ విషయాలు మాట్లాడటం జరిగిందని మంగంపేట సీనియర్ నాయకులు కల్లా చలపతి, అనుమలగుండం చంద్రమోహన్, మాజీ వైస్ ఎంపీపీ గునిపాటి రాయుడు, గునిపాటి కిరణ్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ ఎస్ఎండీ షరీఫ్

సిద్దవటం, ఏప్రిల్ 7:ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతం గా ఎన్నికలు జరుపుకోవాలని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ సూచించారు. సిద్దవటం మండలం పెద్దపల్లి గ్రామ పంచాయ తీలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు పోలింగ్ సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. పోలింగ్ బూతుల వద్ద నిబంధనలు ఉల్లంఘించి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్న గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత పెద్దిరెడ్డి ఆటలు సాగవు

● రాజంపేట ఎంపీ బీజేపీ అభ్యర్థి, మాజీ సీఎం కిరణ్


ముస్లింలతో మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 7: పుంగనూరు నియోజకవర్గంలో అరాచకాలు మితి మీరిపోయాయని, ప్రశ్నించేవారిపై మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మాజీ సీఎం, రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. రానున్న ఎన్నికల తర్వాత వీరి ఆటలు సాగవన్నారు. మీ ప్రాంతాలు అభివృద్ధి జరగాలంటే, సమర్థులైన మంచి నాయకులకు ఓట్లేసి ఎన్నుకోవాలని కోరారు. రొంపిచెర్లలోని చిన్నమసీదు వద్ద ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలతో ముచ్చటించారు. పెద్దమసీదు వద్ద ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాలుగురోడ్ల కూడలిలో ప్రచారరథంపై నుంచి ప్రసంగించారు. 'అన్ని ప్రాంతాల్లో లీటరు పాలు రూ.35, మామిడి కిలో రూ.18 ఉంటే, పుంగనూరు నియోజకవర్గంలో మాత్రం పాలకు రూ.18, మామిడికి రూ.9 ఇస్తున్నారు. ఇది మోసం కాదా? ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణా, మైనింగ్‌తో దోచుకుంటున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రూ.2,250 కోట్లతో మూడు ప్రాజెక్టులు చేపట్టగా.. తప్పుగా భావించిన ఎన్‌జీటీ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.100 కోట్లు పెనాల్టీ వేసింది' అని గుర్తుచేశారు. అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీ సంక్షేమానికి తాను రూ.1200 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలు భయపడాల్సిన పనిలేదని, ప్రశాంత ఎన్నికల కోసం కేంద్ర బలగాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గతంలో పుంగనూరు ఎమ్మెల్యేలుగా సీకే నారాయణరెడ్డి, మొగల్‌సైపుల్లా బేగ్, చల్లా ప్రభాకరరెడ్డి ఎంతో అభివృద్ధి చేశారని టీడీపీ అభ్యర్థి చల్లారామచంద్రారెడ్డి అన్నారు. లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా నల్లారికిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే ఆయన కేంద్ర మంత్రి అయి, మన రాష్ట్రంతోపాటు నియోజకవర్గాన్నీ అభివృద్ధి చేస్తారన్నారు. అంతకుముందు చల్లా రామచంద్రారెడ్డి ఇంటి వద్ద పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, నేతలు పటాన్ అంజాద్‌ఖాన్, షేక్ కరీముల్లా, ఇమ్రాన్ ఖాన్, గౌస్‌పీర్‌ఖాన్, ఖలీల్‌బాషా, ఖాదర్‌బాషా, లియాకత్, మహమ్మదాలీ, ఓబులేశురెడ్డి, నాగరాజ, రామమూర్తి, అబుబకర్, రఫీ, బాబులాల్, మదన మోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

● బంగారు నగలు, మొబైల్ ఫోన్ స్వాధీనం


పోలీసుల అదుపులో నిందితుడు, స్వాధీనం చేసుకున్న నగలు, ఫోన్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 7 : అంతర్ జిల్లా దొంగను తిరుపతి వెస్ట్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అతని నుంచి రూ.6.44 లక్షల విలువైన 129 గ్రాముల బంగారు నగలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి సంజీవయ్యనగర్‌కు చెందిన మహేష్ కొంతకాలంగా సులభ సంపాదనకు అలవాటుపడ్డాడు. తిరుపతి, చిత్తూరులోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద సిబ్బంది అవతారమెత్తాడు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులను, వారి సహాయకులను స్కానింగ్ పేరుతో నమ్మించి, నగలు, విలువైన వస్తువులు అపహరించేవాడు. తిరుపతిలోని స్విమ్స్, రుయా, రమాదేవి ఆస్పత్రుల వద్ద ఇదే తరహా మోసాలు చేశాడు. తిరుపతి పశ్చిమ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ జయనాయక్ దర్యాప్తు చేపట్టారు. రహస్య సమాచారం మేరకు సీఐ జయనాయక్, ఎస్ఐ బాలకృష్ణ అతన్ని చెర్లోపల్లి బైపాస్ రోడ్డులోని భారతీయ విద్యాభవన్ వద్ద పట్టుకున్నారు. బంగారు నగలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

తిరుమలలో ఉగాది ఆస్థానానికి జోరుగా ఏర్పాట్లు


ఆలయం ముందు జరుగుతున్న ఉగాది ఏర్పాట్లు

తిరుమల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఉగాది ఆస్థానానికి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈనెల 9వ తేదీన ఉగాది ఆస్థానాన్ని టీటీడీ నిర్వహించనుంది. ముందుగా తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత పఠనం తరువాత శుద్ధి నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. తర్వాత శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం వుంటుంది. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. కాగా, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 9న ఆలయంలో నిర్వహించే ఆర్జితసేవలైన అష్టదళపాదపద్మారాధన, కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది. ఉగాది సందర్భంగా తిరుమల క్షేత్రాన్ని పది టన్నుల సంప్రదాయ పుష్పాలతో టీటీడీ అలంకరిస్తోంది.

అంగన్వాడీ ఆశలు వమ్ము

● పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చడంలో సీఎం జగన్ విఫలం
● సమ్మెకాలానికీ వేతనం చెల్లించని ప్రభుత్వం

చిత్తూరు, ఏప్రిల్ 7: గత ఎన్నికల ముందు అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను సీఎం జగన్ పూర్తిగా విస్మరించారు. తెలంగాణ కంటే అదనంగా వెయ్యి రూపాయలు జీతం ఇస్తామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని జగన్ ఊరూరా పాదయాత్రలో బాకా ఊదారు. అధికారంలోకి వచ్చాక ఇవన్నీ పక్కన పెట్టేశారు.

వర్కర్‌కు రూ.14,500, ఆయాకు రూ.10వేలను ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రంకన్నా వెయ్యి రూపాయల జీతాన్ని అదనంగా ఇస్తామని గత ఎన్నికలకు ముందు చేపట్టిన తన పాదయాత్రలో అంగన్వాడీలకు జగన్ హామీ ఇచ్చారు. పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామనీ చెప్పారు. వైసీపీ అధికారంలోకి రాకముందు వర్కర్లకు రూ.10,500, ఆయాలకు రూ.6వేలు ఉండేది. జగన్ అధికారంలోకి వచ్చాక రూ.వెయ్యి పెంచారు. తెలంగాణ ప్రభుత్వం పీఆర్‌సీ పెంచడంతో అక్కడి సిబ్బందికి వేతనాలు పెరిగాయి. ప్రస్తుతం తెలంగాణలో వర్కర్‌కు రూ.13,500, ఆయాలకు రూ.9వేల చొప్పున చెల్లిస్తున్నారు. కానీ జగన్ ప్రభుత్వం మాత్రం వర్కర్‌కు రూ.11,500, ఆయాకు రూ.7వేలను మాత్రమే ఇస్తోంది. జగన్ ఇచ్చిన హామీ మేరకు వెయ్యి చొప్పున అదనపు వేతనం ఇవ్వాలంటే.. వర్కర్‌కు రూ.14,500, ఆయాకు రూ.10వేలను ఇవ్వాలి. కానీ ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.

ఇతర సమస్యలు పట్టని వైనం

అంగన్వాడీ వర్కర్లకు ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తామని జగన్ హామీ ఇచ్చారు. రిటైర్‌మెంట్ వయస్సును 62కు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తోపాటు మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి, పనిభారాన్ని తగ్గించాలని వర్కర్లు కోరుతున్నారు. వీటిల్లో ఒక్క సమస్యను కూడా పరిష్కరించక పోవడంతో గత ఏడాది డిసెంబరులో 42 రోజుల పాటు నిరవధిక సమ్మె చేశారు. ఎన్నికల ముందు అంగన్వాడీ వర్కర్ల సమ్మెతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని భావించి.. సంఘ నేతలతో చర్చలు జరిపింది. రిటైర్‌మెంటు వయస్సును 62 ఏళ్లకు పెంచుతూ మాత్రమే జీవో విడుదల చేసింది. మిగిలిన డిమాండ్లకు జీవోలను విడుదల చేయలేదు. అలాగే సమ్మెకాలానికి సంబంధించిన 42 రోజుల పూర్తి వేతనాన్ని ఇస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు విడుదల చేయలేదు. సమస్యలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడానికి కమిటీ వేస్తామని చెప్పి.. నాలుగు నెలలవుతున్నా ఆ ఊసే లేదు. జగన్ ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేసిందని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అంగన్‌వాడీ వర్కర్లు అంటున్నారు.

ప్రభుత్వం దగా చేసింది



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ నిరవధిక సమ్మె చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న మమ్మల్ని వైసీపీ ప్రభుత్వం దగా చేసింది. సమస్యలు పరిష్కరిస్తామని, సమ్మె చేసిన కాలానికి వేతనాన్ని ఇస్తామని చెప్పిన హామీని కూడా ఇంత వరకు నెరవేర్చలేదు. జీవో వచ్చేస్తోంది.. డబ్బులిస్తామని అధికారులు చెబుతున్నారే తప్ప ఇంత వరకు ఇవ్వనేలేదు.

- సుజని, జిల్లా అధ్యక్షురాలు, అంగన్వాడీ, హెల్పర్స్ యూనియన్

అగ్నిప్రమాదంపై సీఎండీ ఆరా


ఎస్పీడీసీఎల్ స్టోర్ నిర్వహణ తీరుపై ఆగ్రహం


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 7: టపాసుల నిప్పురవ్వలు పడటంతో చిత్తూరు గిరింపేటలోని ఎస్పీడీసీఎల్ స్టోర్‌లో అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై సీఎండీ సంతోషరావు ఆరా తీశారు. ఆదివారం స్టోర్‌కొచ్చి అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. స్టోర్ నిర్వహణ సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీదైన వస్తువులున్న చోట ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని సిబ్బందిని ప్రశ్నించారు. ఎక్కడ చూసినా స్క్రాప్ ఉందని, వెంటనే తొలగించాలని ఆదేశించారు. స్టోర్‌లోపల రోడ్లు, సిమెంట్ బెడ్లు ఏర్పాటు చేయాలని, విలువైన వస్తువులను గోడౌన్‌లో భద్రపరచాలని సూచించారు. ఎన్నికల అయిన వెంటనే ఇక్కడ నూతన ఏడీ కార్యాలయం నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రహరీ కూడా మరో 10 అడుగుల ఎత్తు నిర్మించనున్నట్లు తెలిపారు. కాగా, వ్యవసాయ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయని, రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనవెంట ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

సంస్కృతి గొప్పదనాన్ని నేటితరానికి తెలియజెప్పాలి

ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు



ఉగాది పురస్కారాలు అందుకున్న కవులు, రచయితలు

గంగవరం, ఏప్రిల్ 7: మన సంస్కృతి, ఆచారాల గొప్పదనాన్ని నేటి తరానికి తెలియజెప్పేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని విశ్వశ్రీ సాహితీ సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అన్నారు. గంగవరంలోని కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ప్రసంగించారు. విదేశాలకు వెళ్లినా మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన మనందరిపై ఉందన్నారు. తెలుగువారి పండుగులకు, ప్రకృతికి సంబంధం ఉందని చెప్పారు. అనంతరం తమిళనాడు హోసూరుకు చెందిన అగరం వసంత్ రచించిన 'కథమరిచిన మనిషి', 'తల్లివేరు' అనే పుస్తకాలను ఆవిష్కరించారు.

పురస్కారాలిలా..

గీతాంజలి స్మారక సాహిత్య పురస్కారాన్ని రమేష్‌నాయుడికి ప్రదానం చేశారు. అలాగే జాతీయ ఉగాది పురస్కారాలను డాక్టర్ భాస్కర్ వేడియం (కుప్పం), గండికోట వారిజ (పలమనేరు), అగరం వసంత, మునిరాజు (హోసూరు), వి.తిరుపతిరావు, రాంబాబు (కేజీఎఫ్), లక్ష్మీకాంతమ్మ (మాలూరు), రామచంద్ర, రాఘవేంద్ర (బెంగళూరు), సుధాకర్ (శ్రీకాళహస్తి), ఉమాదేవి (మదనపల్లె), గుణశేఖరన్ (గంగవరం), భాగ్యలక్ష్మి (కాణిపాకం), పూర్ణిమ (బంగారుపాళ్యం), డాక్టర్ పోలసాయి జ్యోతి (నాగర్‌కర్నూలు), చిరంజీవి (బైరెడ్డిపల్లి మండలం, కడపనత్తం) బాలసుందరం, దొరస్వామినాయుడు, పార్థసారథి (పలమనేరు)లకు సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప ప్రదానం చేశారు. అలాగే వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన 60 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎన్జీవో సంఘ అధ్యక్షులు ఆనందబాబు, మాధవరెడ్డి, జేటీడీ ధనంజయ, జె.శ్రీరామచంద్రమూర్తి, విమల, ఉమామహేశ్వరరెడ్డి, విజయ్, నవీన్, వివేక్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

మినీ లారీ, కంటైనర్ ఢీ: డ్రైవర్ పరిస్థితి విషమం


సీఎంసీ సమీపంలో ఢీకొన్న కంటైనర్, మినీ లారీ


తీవ్రంగా గాయపడ్డ మినీ లారీ డ్రైవర్ ప్రతాప్

గుడిపాల, ఏప్రిల్ 7: చిత్తూరు-వేలూరు, బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో ఆదివారం తెల్లవారుజామున మినీ లారీ-కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. చిత్తూరు నుంచి వేలూరు వైపుగా వస్తున్న మినీ లారీ, వేలూరు నుంచి చిత్తూరు వైపుగా వస్తున్న కంటైనర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్‌కు చెందిన మినీ లారీ డ్రైవర్ ప్రతాప్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం సీఎంసీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

పంట పొలాలపైపడ్డ ఒంటరి ఏనుగు


ధ్వంసమైన కొబ్బరి తోట - విరిగిపోయిన గేటు

ఐరాల, ఏప్రిల్ 7: ఐరాల మండలంలోని వేదగిరివారిపల్లె పంచాయతీ ఎస్టీ కాలనీలో ఆదివారం వేకువ జామున ఒంటరి ఏనుగు ఒకటి పంట పొలాలపై పడింది. గ్రామానికి చెందిన పలువురి మామిడి తోటల్లో కొమ్మలు విరిచేసింది. కొబ్బరి తోటలో చెట్లు, వరి పంటను నాశనం చేసింది. అటవీశాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి అటవీప్రాంతం వద్ద సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వడదెబ్బతో సీఆర్పీ మృతి


సుధాకర్ శెట్టి (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, ఏప్రిల్ 7: బంగారుపాళ్యం మండలం విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో సీఆర్పీగా పనిచేస్తున్న తిమ్మోజిపల్లికి చెందిన సుధాకర్ శెట్టికి గురువారం వడదెబ్బ తగిలింది. దాంతో అయన పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. ఆదివారం ఉదయం గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఈయన మృతిపట్ల ఎంఈవో నాగేశ్వరరావు, ఎంఈవో-2 రమేష్ బాబు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సిబ్బంది సంతాపం తెలిపారు.


జాతీయ పోటీలకు రచనల ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 7: చిత్తూరు కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జూన్ 12వ తేదీన చిత్తూరులో జాతీయస్థాయి నవలల, కథల సంపుటాల పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు రచనలు ఆహ్వానిస్తున్నట్లు అధ్యక్షురాలు డాక్టర్ కె.రామలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రచయితలు తమ నవలలు, కథల సంపుటాలను జనవరి 2023 నుంచి డిసెంబరు 2023లోపు ప్రచురితమై ఉండాలని, అలాంటి రచనలు ఈనెల 30వ తేదీలోపు తమ కార్యాలయానికి పంపించాలని సూచించారు. నవల, కథల సంపుటాల పోటీల్లో ఎంపికైన వాటిలో రెండేసి వాటికి రూ.10వేల చొప్పున బహుమతి తోపాటు సత్కరిస్తామన్నారు. రచయితలు తమ రచనలను డాక్టర్ కె.రామలక్ష్మి నర్సింగ్ హోం, సుందరయ్యవీధి, చిత్తూరు-517001కు పంపించాలని కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ రోజాప్రియ, డాక్టర్ నిరంజన్‌రెడ్డి కోరారు.

99 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 7: జిల్లాలో ఈనెల మూడో తేదీన ప్రారంభమైన పింఛన్ల పంపిణీ ఆదివారం నాటికి 99శాతం పూర్తయ్యింది. 2,73,304 మందికిగాను 2,70,858 మందికి (99శాతం) పింఛన్లు పంపిణీ చేయగా, 2,446 మందికి ఇవ్వాల్సి ఉందని అధికారులు తెలిపారు.

ఏ బిడ్డా.. మంగళం మా అడ్డా!



రెచ్చిపోతున్న ఎర్రదొంగలు

● రాత్రి చందనం, పగలు గంజాయి
● భయాందోళనకు గురవుతున్న ప్రజలు

వ్యవసాయం సహా ప్రతి వృత్తికీ ఒక సీజన్ అంటూ ఉంటుంది. చివరికి దొంగలు కూడా ఎండాకాలం రాగానే జోరు పెంచుతారు. ఒక్క ఎర్రదొంగలు మాత్రమే సీజన్‌లెస్ స్మగ్లింగ్‌తో రెచ్చిపోతున్నారు. ఎన్నికల కోడ్ అడ్డు కూడా లేదు. అధికారులు, నాయకులు, ప్రజలు సకల వర్గాలూ ఎన్నికల హోరులో మునిగి తేలుతుండగా ఎర్రచందనం దొంగలు మాత్రం దర్జాగా దుంగలను అడవి దాటించే పనులు సాగిస్తున్నారు. తిరుపతి నగరంలోని మంగళం ప్రాంతం వీరికి ప్రధాన అడ్డాగా కొనసాగుతోంది.

మంగళం, ఏప్రిల్ 7 : తిరుపతి నగర శివారు ప్రాంతాలైన మంగళం ప్రాంతంలో అడవి అంచున ఉండే భూపాల్ హౌసింగ్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, తిమ్మినాయుడుపాళెం ప్రాంతాల్లో రాత్రి 11 నుంచీ అపరిచితుల కదలికలు మొదలవుతాయి. చేతిలో టార్చిలైట్లు, గొడ్డళ్లు, ఇతర సామగ్రి వీరి వద్ద ఉంటుంది. ముందుగా 20 నుంచి 30మంది శేషాచలం కొండల్లోకి అడుగుపెడతారు. కొండల్లో అంతా సేఫ్ అని సమాచారం ఇచ్చాక మిగిలినవాళ్లు కొండల్లోకి నడక మొదలు పెడతారు. తెల్లవారు జామున మళ్లీ కదలికలు పెరుగుతాయి. ఎర్రచందనం దుంగలను చిన్నచిన్న ముక్కలుగా చేసి బయటకు తెస్తారు. అప్పటికే సిద్ధంగా ఉన్న బైక్‌లు, కార్లు, జీపుల ద్వారా అవి లక్ష్యం వైపు చేరుకుంటాయి. బీటీఆర్ కాలనీకి పైభాగాన కొండ పక్కన ఉన్న ఇళ్ల మధ్య ఈ కదలికలు మరీ ఎక్కువగా ఉంటున్నాయి. స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.బీటీఆర్‌కాలనీ, మంగళం ప్రాంతాల్లో ఇళ్లు అద్దెకు తీసుకునే అపరిచితులు నెల రోజులుగా పెరిగారని తెలుస్తోంది.పెద్దపెద్దవాళ్లే దీని వెనుక ఉన్నారని అపరిచితులు టీ బంకులు దగ్గర అలా మాటలు వదులుతారు. దీంతో మనకెందుకులే అని జనం సమాచారం కూడా ఎవరికీ ఇవ్వరు. అయితే ఎర్ర దొంగలు పనిలో పనిగా గంజాయిని కూడా వ్యాప్తిలోకి తెస్తున్నారు. ఈ కాలనీల్లోని కుర్రాళ్లను పోగేసి గంజాయికి అలవాటు చేస్తున్నారని జనం ఆందోళన చెందుతున్నారు. అడవిలోంచి ఎర్ర దుంగలను బయటకు తరలించే వాహనాలే గంజాయిని తెస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల వేళ నాయకులకూ డబ్బు అవసరాలు ఎక్కువ కాబట్టే ఎర్ర స్మగ్లింగ్ జోరు పెరిగింది అనే మాటలు ఈ ప్రాంతాల్లో వినిపిస్తున్నాయి.

కృష్ణార్పణం..

- చెరువులు నింపకుండా కాలువ పారించారు
- కుప్పం తరలించేందుకు అధికారుల యాతన
- అలా చూపించి...ఇలా ఆపేశారు
- ఎన్నికల స్టంట్‌గా అభివర్ణిస్తున్న జనం


బి. కొత్తకోట శివారులో చుక్కనీరు లేక బోసిపోయిన హంద్రీ-నీవా కాలువ


ఇటీవల కుప్పం వైపుకు ఈ కాలువ గుండా ప్రవహించిన కృష్ణాజలాలు

బి కొత్తకోట, ఏప్రిల్ 7:కుప్పంకు కృష్ణాజలాలు తరలించేస్తున్నాం. చెరువులు నింపేస్తాం. వ్యవసాయ భూములు సస్యశ్యామలం చేసేస్తాం..ఇది మావల్లే సాధ్యం అని జగన్‌రెడ్డి ప్రభుత్వం బీరాలు పలికినప్పటికీ అది కేవలం ఎన్నికల స్టంట్‌గానే మిగిలిపోయింది అనేది ప్రజలమాట. హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచి కెనాల్ పరిధిలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాలలో 91 చెరువులకు కాలువద్వారా కృష్ణాజలాలు అందించాల్సివున్నా ఆ ప్రయత్నం ఏదీ జరగలేదు. కుప్పం లో నీటిని చూపితేచాలు అన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చేందుకు హెచ్ ఎన్ఎస్ఎస్ అధికారులు తంటాలుపడుతూ, యాతన అనుభవించారు. వేలకోట్లు ఖర్చు చేసి హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువను నిర్మించారు. నాలుగేళ్లుగా ఎత్తిపోతల పథకాలు, కాలువ నిర్వహణకు రూపాయి విదిల్చని ప్రభుత్వం ఎన్నికల ఏడాదిలో మాత్రం మరోసారి హంద్రీ-నీవా జలాలను తీసుకొచ్చి హడావిడి చేశారు.

టీడీపీ హయాంలోనే జిల్లాకు హంద్రీ-నీవా జలాలు

హంద్రీ-నీవా సుజల స్రవంతి కర్నూలు జిల్లాలోని శ్రీశైలం ప్రాజెక్టు నుంచి అనంతపురం జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయరుకు, అక్కడినుంచి శ్రీసత్యసాయి జిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లి రిజర్వాయరుకు తరలుతుంది. అక్కడినుంచి పుంగనూరు బ్రాంచికెనాల్ ద్వారా అన్నమయ్య, చిత్తూరు జిల్లాల మీదుగా పలమనేరు సమీపంలోని అప్పినపల్లి వద్దకు అక్కడి నుంచి కుప్పం బ్రాంచికెనాల్ ద్వారా పరమసముద్రం వరకు 743 కిలోమీటర్లు ప్రవహించి కుప్పంకు నీరు చేరాల్సివుంది. దీనికోసం 8ప్యాకేజీలు, 38 లిఫ్టులు ఏర్పాటు చేశారు. చెర్లోపల్లి రిజర్వాయరు నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనికి పుంగనూరు బ్రాంచి కెనాల్ ద్వారా టీడీపీ హయాంలోనే నీటిని పారించారు. కొన్ని చెరువులకూ నీటిని విడుదల చేశారు. కాలువనిర్మాణం కోసం మదనపల్లె వద్ద 3కిలోమీటర్ల సొరంగం, కుప్పం ఉపకాలువ కు పలమనేరు బైరెడ్డిపల్లి మండలాల్లో సొరంగాలు తవ్వించారు.

కుప్పం బ్రాంచ్‌కెనాల్‌కు అప్పట్లోనే రూ.144 కోట్లు

పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లి నుంచి ప్రారంభం అయ్యే కుప్పం బ్రాంచ్‌కెనాల్ నిర్మాణం పూర్తి అయినా అదనపు మట్టిపనులు, కాంక్రీటు నిర్మాణాలకు అదనంగా 2018లో జీవో నంబరు 32 తీసుకొచ్చి రూ.144.7 కోట్లు విడుదల చేసింది. దీంతో కుప్పం బ్రాంచి కెనాల్ పను ల విలువ రూ.574 కోట్లకు చేరింది. 123 కి.మీలు సాగే ఈ బ్రాంచ్‌కె నాల్‌పై శంకర్రాయలపేట, పసుపత్తూరు, ఆదినేపల్లి వద్ద ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని పంపింగ్ చేస్తారు.

చెరువులు నింపడంలో చిత్తశుద్ధి ఏదీ..

వైసీపీ హయాంలో రెండుసార్లు హంద్రీ-నీవా నీటిని జిల్లాకు తరలించినా స్థానికంగా ఉన్న చెరువులను నింపాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వంలో కనిపించలేదనే విమర్శలు వున్నాయి. ఎన్నికల నేపథ్యంలో కుప్పంకు తాము ఏదో చేసేశాము అని అక్కడి ఓటర్లకు భ్రమ కల్పించడానికి మాత్రమే హంద్రీ-నీవా జలాలు ఆవిరి అయిపోయాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,80,450ఎకరాలకు సాగునీరు, 15లక్షల మందికి తాగునీరు అందించాలన్నది ప్రాజెక్టు లక్ష్యం. రూ.2,905 కోట్ల అంచనాతో ప్రారంభమై, పూర్తి అయ్యేసరికి 3,900 కోట్లకు పైగా ఖర్చు అయింది. మదనపల్లి డివిజన్‌లో 92 చెరువులను హంద్రీ-నీవా ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం ఆ దిశగా తీసుకున్న చర్యలు శూన్యం.

కృష్ణా జలాలు గాలికి ఆవిరి..

చెర్లోపల్లి రిజర్వాయరు నుంచి 7 లిఫ్టుల ద్వారా పుంగనూరు బ్రాంచి కెనాల్ మీదుగా అప్పినపల్లెకు, అక్కడి నుంచి కుప్పం ప్రాంతంలోని పరమసముద్రం చెరువుకు నీటిని తరలించేందుకు రెండునెలలు పట్టింది. ఎండవేడికి నీరు ఆవిరి అయిపోవడం, కాలువలో ఇంకిపోవడంతో చెర్లోపల్లినుంచి 150-200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినా కుప్పంకు 10 క్యూసెక్కులు కూడా చేరలేదు. సుమారు 400కి.మీ.లు దూరం ప్రవహించాల్సివున్నందున నీరు వేగంగా ముందుకు సాగలేదు. చెర్లోపల్లి రిజర్వాయరు నీటినిల్వ సామర్థ్యం 1.618టీయంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 0.4 టీయంసీలకు పడిపోయింది. శ్రీశైలం నుంచి నీటి లభ్యత తగ్గడంతో లిఫ్టింగ్‌ను ఆపేశారు. కుప్పం చేరిన నీరు సీయం పర్యటన హడావిడి మాత్రమే కనిపించి ఆ తర్వాత కాలువ బోసిపోయింది.

వైభవంగా కోయిల్‌ఆల్వార్ తిరుమంజనం

వాల్మీకిపురం, ఏప్రిల్ 7: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరాముడి ఆలయంలో ఆదివారం కోయిల్‌ఆల్వార్ తిరుమంజనం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ప్రతియేటా పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు ముందు చేపట్టే కార్యక్రమాలు టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయాత్పూర్వం సుప్రభాత సేవతో మొదలు ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం బ్రహ్మోత్సవాలకు ముస్తాబు చేసే దిశగా ఆలయ గర్భగుడి మొదలు సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేపట్టారు. ఐదురోజుల్లో పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా ఆలయ ప్రాంగణం సర్వాంగసుందరంగా ముస్తాబవుతోంది. కోయిల్‌ఆల్వార్ తిరుమంజనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భాషికాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరీ జ్యోతి ఉత్సవాలు


ఉత్సవాలకు ముస్తాబైన చౌడేశ్వరిదేవి ఆలయం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 7: పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరీదేవి ఆలయంలో చౌడేశ్వరీ జ్యోతి ఉత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 11 వరకు నాలుగు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటి అధ్యక్షుడు ఉప్పురామచంద్ర, కార్యదర్శి, ట్రెజరర్ రామిశెట్టిలోకేస్, ప్రభాకర్ తెలిపారు. 8న అమ్మవారికి వెండికవచం అలంకరణ, రాత్రికి జ్యోతులతో దీలు మోయడం జరుగుతుందన్నారు. 9న గణపతి, అమ్మవారికి విశేషాలంకరణ, రాత్రికి అమ్మవారు సింహవాహనంపై పుష్పపల్లకిలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అదేరోజు రాత్రి అగ్నిగుండప్రవేశం జరుగుతుందన్నారు. 10న సాయంత్రం తొగటవీర క్షత్రియ సంఘం వారిచే ఉట్లతిరుణాళ అత్యంత వైభవం నిర్వహిస్తామన్నారు. 11న అమ్మవారి లడ్డు వేలం, అమ్మవారికి సమర్పించిన చీరలు వేలం పాట నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, ఏప్రిల్ 7:మండలంలోని చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతాన లక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజల అనంతరం అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవ డానికి ఆలయానికి రావడంతో పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

కలకడ, ఏప్రిల్ 7: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు లక్ష్మయ్య మృతి చెందినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని బాట వారిపల్లె పంచాయితీ కె.మాదిగపల్లెకు చెందిన లక్ష్మయ్య నడుచుకుంటూ వెళ్లతుండగా ఆటో ఢీకొందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం పీలేరు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు. కాగా లక్ష్మయ్య భౌతికకాయాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి కలకడ లయన్స్ క్లబ్ తరపున రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు దగ్గుబాటి వెంకటేశ్వరరావు తెలిపారు.

మహిళపై దాడి.. ఆస్పత్రికి తరలింపు

మదనపసల్లె అర్బన్, ఏప్రిల్ 7: మదనపల్లె రూరల్ మండలం వేంపల్లెలో శనివారం రాత్రి మహిళపై దాడి చేసి గాయపర్చిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు రామకృష్ణ భార్య టి.బాయమ్మ(35)ను అదే గ్రామానికి చెందిన గోపెమ్మ, ఆమె భర్త నారాయణ అనుచరులు కలిసి దాడి చేసి తలపై గాయం చేశారు. ఆదివారం స్థానికులు గాయపడిన బాయమ్మను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం వారు మదనపల్లె రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కూటమి విజయం తథ్యం..150 సీట్లు ఖాయం


టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

కలకడ, ఏప్రిల్ 7:రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపు ఖాయమని, 150 సీట్లు సాధించడం ఖచ్చితమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నాయకులతో కలిసి కలకడ మండలం గుడిబండ పంచాయతీలోని చొక్కనవారిపల్లె, పాపిగారిపల్లె, తెట్టు తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింట కరపత్రాలను అందజేసి మేనిఫెస్టోను వివరించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ వస్తోందన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ప్రజలు కూటమిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాశ్, మద్దిపట్ల సూర్యప్రకాశ్, నాయకులు బరకం శ్రీనివాసుల రెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌నాయుడు, తిరుపతినాయు డు, కోట రమణ, బివిస్వామి, కాంతారావు, పివిరమణనాయుడు, త్యాగరాజు, ధీరజ్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, రాజేంద్ర, పీరయ్య, ప్రసాద్‌నాయుడు, సుదర్శన్, ఆంజినేయులు, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ


పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పీలేరు, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పీలేరు మండలంలోని తలపుల, రేగళ్ల పీహెచ్‌సీల సిబ్బంది ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు ఆసుపత్రి వైద్యాధికారి శివయ్య మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో ఈ ఏడాది 'నా ఆరోగ్యం-నా హక్కు' అన్న నినాదంతో నిర్వహించినట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకుని తమ ఆరోగ్య స్థితిని తెలుసుకోవాలన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేగళ్ల, తలపుల పీహెచ్‌సీల పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ సాధ్యం

ములకలచెరువు, ఏప్రిల్ 7: పర్యావరణ పరిరక్షణతోనే జీవరాసుల మనుగడ సాధ్యమని నేషనల్ గ్రీన్‌కోర్ కోఆర్డీనేటర్ రెడ్డిరాధా పేర్కొన్నారు. మండలంలోని బురకాయలకోట జడ్పీహైస్కూల్‌లో ఆదివారం పర్యావరణ పరిరక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విద్యా సామగ్రిని బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో కేంద్ర బలగాల కవాతు



పెద్దమండ్యం, ఏప్రిల్ 7: పెద్దమండ్యం, వెలిగల్లు, తురకపల్లి, సిద్దవరం, శివపురం, కలిచెర్ల గ్రామాలలో ఆదివారం పెద్దమండ్యం ఎస్ఐ చెన్నకేశవ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో త్వరలో జరుగున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల శాంతిభద్రత దృశ్య ముందస్తుగా కేంద్ర బలగాలు పెద్దమండ్యం మండలంలో కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చింది ప్రజలు అచితూచి వ్యవహరించాలని తెలిపారు. గ్రామాలలో కొత్త వాళ్లు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎస్ఐలు మధు ఆచారి, ఇషాక్, పోలీసు సిబ్బంది కృష్ణమూర్తి, ఖాన్, శ్యామ్, మధు ఎస్ఎస్‌టీ కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

షాజహాన్‌బాషాకు అపూర్వ స్వాగతం



మదనపల్లె టౌన్/అర్బన్, ఏప్రిల్ 7: మదనపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషాకు ఆదివారం అపూర్వస్వాగతం లభించింది. మండలంలోని పొన్నేటిపాళెం పంచాయతీ చిప్పిలి గ్రామంలో యువత షాజహాన్‌బాషాకు, జనసేనే నేత శ్రీరామ రామాంజనేయులు 1101 కొబ్బరికాయలతో గజమాల తయారు చేయించి అపూర్వ స్వాగతం పలికారు.చిప్పిలికి చెందిన గురు నాథ్, వెంకటరమణ, అమర, జీవీ నాయుడు,, సవరంవారిపల్లె ఈశ్వరనాయుడు, మధు, వేణు,, ఆదినారాయణ, 300 మందితో గ్రామంలో రోడ్‌షో నిర్వహించారు. ప్రజాసంక్షేమం కావాలంటే రాష్ట్రంలో చంద్రబాబును సీఎంగా, మదనపల్లెలో కూటమి అభ్యర్థిగా తనను అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్‌జే వెంకటేశ్, ఎస్ఏ మస్తాన్, దొరస్వామినాయుడు, బాలుస్వామి, నవీన్, ఎం. నాగయ్య, రామమూర్తి, జనసేన నాయకులు దారం అనిత, రామాంజనేయులు, బెస్తసంఘం రమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి తొగటవీర క్షత్రీయసంఘం నేత


టీడీపీలో చేరిన తొగటవీర క్షత్రీయ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నమయ్యకు కండువా వేసి ఆహ్వానిస్తున్న షాజహాన్‌బాషా

మదనపల్లె/టౌన్, ఏప్రిల్ 7: అన్నమయ్య జిల్లా తొగటవీర క్షత్రీయ సంఘం ఉపాధ్యక్షుడు రామిశెట్టి రత్నమయ్య టీడీపీలో చేరారు. ఆదివారం స్థానిక నీరుగట్టువారిపల్లెలోని ఆయన నివాసంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో రత్నమయ్యతో పాటు పలువురు టీడీపీలో చేరారు. టీడీపీ అధికారంలోకి వస్తూనే మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని, అప్పుడే మదనపల్లె అభివృద్ధి సాధ్యమని షాజహాన్‌బాషా వెల్లడించారు. మాజీ సైనికులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటానని టీడీపీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన.. శేష్‌మహల్ ఏరియాలోని మాజీసైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు నివాసానికి వెళ్లి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.పట్టణంలోని హోమియో వైద్యుడు డాక్టర్ రామానాయుడును బెంగళూరు బస్టాండులోని టీడీపీ కార్యాలయంలో కోళ్లబైలు పంచా యతీ వైసీపీ నాయకుడు రామిరెడ్డి షాజహాన్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్న మదన పల్లె సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బోయపాటి కమలాకర్ ఆధ్వర్యంలో షాజహాన్‌బాషాను కలసి టీడీపీ గెలుపునకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడెం సిద్దప్ప, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు అంజినేయులు, నీలకంఠ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 85 మంది ఉద్యోగాలకు ఎంపిక



మదనపల్లె టౌన్, ఏప్రిల్ 7: హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ లాజిక్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 85 మంది డిగ్రీ ఫైన లియర్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలో 220 మంది డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొనగా వారిలో ప్రతిభ చూపిన 85 మందిని బిజినెస్ ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. వారికి వార్షిక వేతనం రూ.2.25లక్షలు అందిస్తారని కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్‌ప్రిన్సిపాల్ రాఘవేంద్ర అభినందించారు.

నాటు సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లి, ఏప్రిల్ 7: నాటుసారా విక్రయిస్తున్న పల్లపు రవి(78)అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 12లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. తన సిబ్బందితో దాడి చేసి అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలు రానుండడంతో పకడ్బందీగా తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి పూర్వ వైభవం

- రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించండి
- తంబళ్లపల్లె కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి


పథకాలను ప్రజలకు వివరిస్తున్న కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 7: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రానికి పూర్వ వైభవం వచ్చి భవిష్యత్తు బాగుంటుందని టీడీపీ, జనసేన, బీజేపి కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రా రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో నిరుపేదలు ఆర్థికంగా బలపడతారని అన్నారు. ఆదివారం జయచంద్రారెడ్డి టీడీపీ, జనసేన నాయ కులు, కార్యకర్తలతో కలసి మండలంలోని గుండ్లపల్లె, చెట్లవారిపల్లె, వేమారెడ్డిగారిపల్లెల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో మహిళలు జయచంద్రారెడ్డికి హారతి ఇచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను కలసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి పథకాలు వాటి ద్వారా చేకూరే లబ్ధిని వివరించారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ముప్పై ఏళ్లు వెనుకబడిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తిరిగి చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను ఆశీర్వదించి గెలిపిస్తే తంబళ్లపల్లెను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణనాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చలపతినాయుడు, యూనిట్ ఇన్‌చార్జ్ కాలానారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన, నాందిరెడ్డప్ప, సోముశేఖర్, టీడీపీ యువ నాయకులు శశిధర్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, తెలుగుయువత నరసింహులు, వీరాంజినేయులు, కాలా చైతన్య, క్రిష్టారెడ్డి, అశోక్, మధు, చాంద్‌బాషా, కే.శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటప్ప, వేటా మల్లికార్జున, భాస్కర్, జనసేన నాయకులు నరేంద్రరెడ్డి, సురేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు


తంబళ్లపల్లె ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

ములకలచెరువు, ఏప్రిల్ 7: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. తంబళ్లపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరుతున్నారు. తాజాగా ములకలచెరువు మండలం సోంపల్లెలో శనివారం రాత్రి పలురువు వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోంపల్లెకు చెందిన వైసీపీ నాయకులు విజయ, మహేష్, కిషోర్, శ్రీనివాసులు, రాష్ట్ర రజక సంఘం సభ్యుడు శ్రీనివాసులు తదితరులు పార్టీలో చేరారు. వారికి ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాద్, సొంపల్లె మాజీ సర్పంచ్ యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, నాయకులు పాలరాము, రమణరెడ్డి, వెంకటసిద్ధయ్య పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డితో భేటి అయిన శంకర్ వర్గీయులు


నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి మాట్లాడుతున్న తంబళ్లపల్లె టీడీపీ నేతలు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 7 : తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పీటీఎం, బి.కొత్తకోట, పెద్దమండ్యం, తంబళ్లపల్లె కురబలకోట, ములకలచెరువు, మండలాలకు చెందిన శంకర్‌వర్గీయులు ఆదివారం రాజంపేట పార్లమెంట్ బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థి అయిన నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డితో భేటి అయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఆయనతో మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా ఉన్నా ఇక్కడ గత ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించినప్పటికి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇక్కడ టీడీపీకి సరైన నాయకత్వం లేకపోవడంతో వచ్చే ఎన్నికల్లో టీడీపీకి సహకరించేవారు లేరన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా కొత్త వ్యక్తికి టికెట్ కేటాయించడంతో టీడీపీ కేడర్ బలహీన పడిందన్నారు. కావున తంబళ్లపల్లె నియోజక వర్గం ఎమ్మెల్యే టికెట్‌ను మరొక్కసారి పునరాలోచించి సరైన వ్యక్తిని నియమించాలని కోరారు. అదిష్టానానికి తంబళ్లపల్లె విషయం తీసుకెళ్లి మంచి నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గం పోల్ మెనేజ్‌మెంట్ కుడుం శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ గూటం ఈశ్వరప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తమక శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జ్ మద్దయ్యగారిపల్లె హరి, కుడుం రంజిత్, మాజీ సర్పంచ్ ఈవీ రమణ, పక్రుద్దీన్ పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్నా..ఆశీర్వదించండి

- ఆత్మీయ సదస్సులో పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర పిలుపు


ఆత్మీయ సదస్సును ఉద్దేశించి మాట్లాడుతున్న పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర, సమావేశానికి హాజరైన జనం

బి.కొత్తకోట, ఏప్రిల్ 7: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి తాను ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్నానని, తనను ఆశీర్వదించాలని పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం బి.కొత్తకోటలోని కొండా ఎస్టేట్‌లో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీలకు అతీతంగా ఆయన అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి పూలమాలలతో నరేంద్రను సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పీటీయం, బి.కొత్తకోట, కురబలకోట మండలాలకు చెందిన పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు, నరేంద్ర అభిమానులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌విందులో పాల్గొన్న నల్లారి కిశోర్



వాల్మీకిపురం, ఏప్రిల్ 7: వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామంలో ఆదివారం సాయంత్రం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఇఫ్తార్‌విందుకు హాజరయ్యారు. స్థానిక బస్టాండు సమీపంలోని మసీదులో మైనార్టీలతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమంతా ఐక్యమత్యంగా మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లి మధు, టీడీపీ,జనసేన మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, కిశోర్, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, నాయకులు ద్వారకనాథరెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కేవీరెడ్డి, కువైట్ ఆది,చంద్రారెడ్డి, జమీర్ ఆలీఖాన్ మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

నీటి సమస్యపై దృష్టి సారించండి


కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి

గుర్రంకొండ, ఏప్రిల్ 7:గ్రామాల్లో నీటి తాగుసమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి ఆదివారం కార్యదర్శులకు సూచించారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె, నడిమిఖంద్రిగ, రామాపురం, తరిగొండ పంచాయతీలో నీటి సమస్యపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. అలాగే ఎన్నికల కోడ్ ఉన్నందున్న గ్రామాల్లో కోడ్ ఉల్లంఘనలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.